ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
చిత్తూరు జిల్లా వార్తలు
బుధవారం 19 జూన్ 2024

దిగుబడి తగ్గినా.. ధర పలకని మామిడి!



పంట దిగుబడి తగ్గితే.. డిమాండుకు తగ్గ సరఫరా ఉండదు. దీంతో ధర పెరుగుతుంది. దీనివల్ల రైతులకు కొంత వరకు నష్ట నివారణ జరుగుతుంది. కానీ మామిడి విషయానికి వచ్చేసరికి దిగుబడి తగ్గినా.. ధరలు పెరగలేదు. రానురాను ఉన్న ధరలూ పతనమయ్యాయి. ఫ్యాక్టరీలు, వ్యాపారులు సిండికేట్ కావడంతో ఈ పరిస్థితి తలెత్తిందన్న విమర్శలున్నాయి. దీనివల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు.

- చిత్తూరు (సెంట్రల్)

● ఫ్యాక్టరీలు, వ్యాపారుల సిండికేటే కారణం ● రైతులకు తీరని నష్టం



గ్రేడింగ్ చేసిన ఇమామ్ పసంద్

చిత్తూరు జిల్లాలో 1,71,198, తిరుపతి జిల్లాలో 1,37,500 ఎకరాలు వెరసి ఉమ్మడి జిల్లాలో 3,08,698 ఎకరాల్లో మామిడి తోటలున్నాయి. బంగారుపాళ్యం, ఐరాల, తవణంపల్లె మండలాల్లో అధికంగా తోతాపురి రకం సాగులో ఉంది. టేబుల్ వెరైటీలుగా చెప్పుకునే బేనీషా, నీలం, మల్లిక, కాలేపాడ్, హిమామ్ పసంద్, పులిహోరా రకాలనూ జిల్లా రైతులు సాగు చేస్తున్నారు. మామిడి రైతులను ఏటా ఏదో ఓ రూపంలో సంక్షోభం పట్టి పీడిస్తోంది. ఈసారి వాతావరణ ప్రతికూల పరిస్థితులు, అకాల వర్షాలు కారణాలుగా నిలిచాయి. మే నెల ద్వితీయ పక్షం నుంచి మొదలైన గాలి.. అకాల వర్షాలతో కాయలు చాలావరకు కాయలు నేలరాలాయి. దీనివల్ల 10-20 శాతం పంట చేతికి రావడం రైతులను నిరాశకు గురి చేసింది. దిగుబడి తగ్గిన క్రమంలో ధరలు పెరుగుతాయని భావించిన రైతులకు సిండికేట్ల బెడద దెబ్బతీసింది.

సిండికేట్‌తో ధరలు పతనం

జిల్లాలో 30 గుజ్జు పరిశ్రమలు, మరో 30 ర్యాంపులు ఉన్నాయి. గుజ్జు పరిశ్రమలు రైతుల నుంచి నేరుగా మామిడి కాయలు కొంటున్నాయి. ఎగుమతులు, ఇతర విక్రయాలు కోసం వ్యాపారులు ర్యాంపుల వద్ద రైతుల నుంచి నేరుగా కొనుగోలు చేస్తున్నారు. మరోవైపు చిత్తూరు, బంగారుపాళ్యం మార్కెట్ యార్డుల్లోనూ వ్యాపారులు క్రయ, విక్రయాలు చేస్తున్నారు. వీరంతా సిండికేట్ కావడంతో మామిడి ధరలు గణనీయంగా పడిపోయాయి. మల్గూభా టన్ను ధర రూ.1.30 లక్షల నుంచి రూ.60 వేలకు పడిపోగా, ఇమామ్‌పసంద్ రూ.లక్ష నుంచి రూ.55 వేలకు, కాలేపాడ్ రూ.65 వేల నుంచి రూ.48 వేలు, బేనీషా రూ.57 వేల నుంచి రూ.41 వేలు, మంగు కారణంగా ఖాదర్ రకం టన్నుకు రూ.57 వేల నుంచి రూ.35 వేలు, మల్లిక రూ.65 వేల నుంచి రూ. 33 వేలు, పులిహోరా రూ.35 వేల నుంచి రూ.19 వేలు, తోతాపురి రూ.30 వేల నుంచి 21 వేలు, మామిడి నాటి రకాలు టన్ను ధర రూ.18 వేల నుంచి రూ.9 వేలకు పడిపోయాయి. జిల్లాలోని ఓ ఫ్యాక్టరీ టన్నుకు రూ.23 వేలు ఇస్తుండగా, ఇతర ఫ్యాక్టరీలు రూ.21 వేలు ఇస్తున్నాయి. ర్యాంపుల వద్ద ఈ ధర రూ.20 వేలకు పడిపోయింది. వచ్చిన కాయలను వ్యాపారులు వెంటనే కొనుగోలు చేయపోవడంతో రైతులకు నష్టం కలుగుతోంది.

తోతాపురికి రూ.40 వేలు వస్తే ఊరట

మే నుంచి ఆగస్టు వరకు సాగే తోతాపురి రకం కాపు జూన్ మొదటి వారానికే ముగుస్తుండటం రైతులను తీవ్ర నిరాశకు గురి చేసింది. పిందె దశ నుంచి కాయ చేతికి వచ్చే వరకు తెగుళ్ల, ఇతర ప్రతికూల పరిస్థితుల నుంచి పంటను కాపాడుకోవడం.. కూలి ఖర్చులతో కలుపుకుని ఎకరాకు రూ.10 వేలు ఖర్చవుతోంది. ఈ ఏడాది 20 శాతం పంట చేతికి వచ్చింది. పెట్టుబడి ఖర్చులకు తట్టుకుని నిలబడాలంటే టన్నుకు రూ.40 వేలు వస్తేనే ప్రయోజనం ఉంటుందని రైతులు అంటున్నారు.

ఇతర ప్రాంతాల నుంచి దిగుమతి

జిల్లాలో 30 మామిడి గుజ్జు పరిశ్రమలు, మరో 30 ర్యాంపులు ఉన్నాయి. ఏటా జిల్లాలో 4.5 లక్షల టన్నుల నుంచి 6 లక్షల టన్నుల దిగుబడి ఉండేది. ఇందులో 1.5 లక్ష టన్నుల నుంచి రూ.3.5 లక్షల టన్నుల వరకు ఫ్యాక్టరీలకు, మిగిలిన మొత్తం విదేశాలకు ఎగుమతి, ఇతర వ్యాపారం చేసేవారు. ఈ ఏడాది ఉద్యానశాఖ లెక్కల ప్రకారం రూ.2.5 లక్షల టన్నుల దిగుబడే వచ్చింది. ఇది ఫ్యాక్టరీలకూ సరిపోదు. దీంతో ఫ్యాక్టరీ యాజమాన్యాలు తమిళనాడు రాష్ట్రంలోని క్రిష్ణగిరి, ఏపీలోని నూజివీడు, కర్ణాటకలోని శ్రీనివాసపురం నుంచి కాయలు దిగుమతి చేసుకోవడంపై దృష్టిపెట్టాయి.

ఆరేళ్లుగా సంక్షోభమే

2018లో మామిడి ధరలు పతనమయ్యాయి. అప్పటి టీడీపీ ప్రభుత్వం చొరవ తీసుకుని కిలో మీద రూ.2.50 ఇచ్చి రైతులను ఆదుకుంది. 2019లో అకాల వర్షాలతో పంట దెబ్బతింది. 2020, 2021లో కరోనా కారణంగా ఎగుమతి చేసుకోలేని పరిస్థితి. 2022లో దిగుబడి లేకుండా పోయింది. వరుసగా మామిడి రైతు కోలుకోలేని నేపథ్యంలో 2023లో జిల్లాలో దిగుబడి బాగా వచ్చింది. అయినా ఫ్యాక్టరీలు సిండికేట్‌గా మారి రైతులకు కనీస మద్దతు ధర ఇవ్వలేదు. ఇప్పుడేమో వాతావరణ ప్రతికూల పరిస్థితులతో దిగుబడి 20 శాతానికి పడిపోయింది. మళ్లీ సిండికేట్‌తో ధరలు తగ్గాయి. ఇలా ఆరేళ్లుగా మామిడి రైతులు నష్టాలను చవిచూస్తున్నారు.

టన్నుకు రూ.35 వేలు చెల్లించాలి

తోతాపురి రకం మామిడి టన్నుకు రూ.35వేలు చెల్లించాలని భారతీయ కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు ధనంజయనాయుడు కోరారు. ఈ మేరకు మంగళవారం చిత్తూరు కలెక్టరేట్‌లో జరిగిన 'ప్రజా సమస్యల ఫిర్యాదులు- పరిష్కారాలు' కార్యక్రమంలో కలెక్టరుకు వినతిపత్రం అందించారు. గుజ్జు పరిశ్రమలు, ర్యాంపుల యాజమానులు సిండికేట్‌గా మారి ధర లేకుండా చేశారని ఆరోపించారు. మామిడి బోర్డు ఏర్పాటు చేసి, రైతు నుంచి నేరుగా పంట కొనుగోలు చేయాలని కోరారు.

గిట్టుబాటు ధర అమలేదీ?

ధరల పతనం నేపథ్యంలో సీఎం చంద్రబాబు ఆదేశాలతో చిత్తూరు, తిరుపతి కలెక్టర్లు షన్మోహన్, ప్రవీణ్‌కుమార్ స్పందించారు. అధికారులతో కలిసి తోతాపురి రకం టన్ను రూ.30 వేలకు తక్కువ కాకుండా కొనుగోలు చేయాలని ఆదివారం పల్ప్ ఫ్యాక్టరీల యాజమాన్యాలకు ఆదేశాలిచ్చారు. ఇప్పటికీ ఈ ఆదేశాలు అమలు కావడం లేదని రైతులు అంటున్నారు. టన్ను రూ.21-22 వేలకు మాత్రమే కొనుగోలు చేస్తుండటంపై వారు గగ్గోలు పెడుతున్నారు. గిట్టుబాటు ధరను అమలు చేయడంలో ఉద్యాన, మార్కెటింగ్ శాఖ అధికారులు విఫలమయ్యారని ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. మండీలు, ఫ్యాక్టరీలు, ర్యాంపుల వద్ద అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో వ్యాపారులు ధరలను గణనీయంగా తగ్గించేస్తున్నారని ఆరోపించారు. ఏటా ఫ్యాక్టరీలు, వ్యాపారులు సిండికేట్ అవుతున్నా అధికారులు మాత్రం ప్రేక్షకపాత్ర పోషిస్తూ తీరని అన్యాయం చేస్తున్నారని రైతులు, రైతు సంఘాల నాయకులు ఆరోపణలు చేస్తున్నారు.



ఎగుమతులకు గ్రేడింగ్ చేసిన బేనీషా

ఫిర్యాదుల దినానికి కదిలొచ్చిన జనం



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్, ఇతర అధికారులు



చిత్తూరు, జూన్ 18: మార్చి నెలలో ఎన్నికల కోడ్ రావడంతో 'స్పందన' కార్యక్రమం ఆగింది. ఇప్పుడు కొత్త ప్రభుత్వం కొలువు దీరింది. స్పందన స్థానంలో 'ప్రజా సమస్యల ఫిర్యాదులు- పరిష్కారాలు' పేరిట మంగళవారం కలెక్టరేట్‌లో ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. మూడు నెలల తర్వాత నిర్వహించిన ఈ కార్యక్రమానికి ప్రజలు కదిలి వచ్చారు. సోమవారం బక్రీద్ పండగ కారణంగా సెలవు ఉండటంతో మంగళవారం జిల్లాలో కార్యక్రమాన్ని మొదలు పెట్టారు. ఇకపై ప్రతి సోమవారం ఉంటుందని కలెక్టర్ షన్మోహన్ తెలిపారు. కాగా, మంగళవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమానికి 46 వినతులు వచ్చాయి. వీటిలో రెవెన్యూ శాఖకు 35, నేషనల్ హైవే, వ్యవసాయ శాఖ, డీఆర్‌డీఏ, చిత్తూరు నగరపాలక సంస్థ, విభిన్న ప్రతిభావంతుల శాఖ, పోలీసు శాఖ, ఎంప్లాయిమెంట్, హౌసింగ్, విద్యుత్‌శాఖ, డీసీవో, ఆరోగ్యశ్రీ శాఖలకు ఒక్కొక్కటి చొప్పున అందాయి. కలెక్టర్ షన్మోహన్, జేసీ శ్రీనివాసులు, ట్రైనీ కలెక్టర్ హిమవంశీ, డీఆర్వో పుల్లయ్య, డ్వామా పీడీ రాజశేఖర్, ఇతర జిల్లా అధికారులు అర్జీలు స్వీకరించారు. వీటిలో కొన్ని..

● తమ స్థలాన్ని కబ్జా చేయాలని చూస్తున్నారని రామకుప్పం మండలం అడవిబూదుగూరుకు చెందిన కణ్మని, రాణి కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చారు. 20 ఏళ్ల క్రితం గ్రామంలో 17 సెంట్ల భూమిని కొనుగోలు చేసినట్లు చెప్పారు. ఇప్పుడు మంచి ధర ఉండటంతో గ్రామానికి చెందిన కొందరు పెద్దలు దౌర్జన్యంగా లాక్కోవాలని చూస్తున్నారని, న్యాయం చేయాలని కోరారు.

● చిత్తూరు నగర సమస్యలను పరిష్కరించాలని చిత్తూరు అభివృద్ధి వేదిక కార్యదర్శి చైతన్య, ఉపాధ్యక్షుడు సురేంద్రనాథ్ కోరారు. చిత్తూరుకు అడవిపల్లె రిజర్వాయర్ నుంచి తాగుటి పైపులైన్, విశ్వవిద్యాలయం ఏర్పాటు, ప్రభుత్వ ఆస్పత్రిలో సూపర్ స్పెషాలిటీ సేవలు, ఇతర సౌకర్యాల కల్పనకు చర్యలు చేపట్టాలన్నారు.

పింఛను కోసం..

ఈమె పేరు సుబ్బమ్మ. పులిచెర్ల మండలం కల్లూరు. గత ప్రభుత్వంలో రద్దు చేసిన పింఛను తిరిగి ఇవ్వాలని కోరుతూ కలెక్టరుకు వినతిపత్రం సమర్పించారు. సంబంధం లేని కారణాలు చెప్పి 2020లో పింఛను రద్దు చేశారన్నారు.

● స్థానికంగా లేననే కారణం చూపి తనకు ఈ ఏడాది మార్చి నుంచి పింఛను ఆపేశారని ఎస్ఆర్‌పురం మండలం శెట్టివానినత్తం గ్రామానికి చెందిన మునెమ్మ కన్నీటిపర్యంతమయ్యారు. తనకు పింఛను తిరిగి అందించాలని కోరారు.



హాజరైన వివిధ శాఖల అధికారులు

ఏపీపీజీఈసెట్‌లో 90.44 శాతం ఉత్తీర్ణత

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూన్ 18 :ఫార్మసీ, ఇంజనీరింగు పీజీ కోర్సుల ప్రవేశాల కోసం నిర్వహించిన ఏపీపీజీఈసెట్-2024 ఫలితాలను ఎస్వీయూ వీసీ ప్రొఫెసర్ శ్రీకాంత్ రెడ్డి మంగళవారం తిరుపతిలో విడుదల చేశారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ.. గత నెల 29 నుంచీ 31వ తేదీ దాకా పరీక్షలు నిర్వహించామన్నారు. 13 సబ్జెక్టులకు 10,143 మంది దరఖాస్తు చేశారన్నారు. వీరిలో 8706 మంది పరీక్షలు రాశారని తెలిపారు.90. 44 శాతం అంటే 78744 మంది ఉత్తీర్ణత సాధించారని చెప్పారు.ఫలితాల కోసం..హెచ్‌టీటీపీఎస్.సెట్స్‌ఏపీఎస్‌సీహెచ్‌ఈ.ఏపీ.గవర్నమెంట్.ఇన్. పీజీసెట్స్.. వెబ్‌సైట్ చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏపీపీజీఈసెట్ కన్వీనర్ రమాశ్రీ, వర్సిటీ మీడియా కో-ఆర్డినేటర్ ప్రొఫెసర్ పీసీ వేంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఉమ్మడి చిత్తూరు జిల్లా ర్యాంకర్లు వీరే

నానో టెక్నాలజీ విభాగంలో తిరుపతి నగరం జీవకోనకు చెందిన ఎ.వంశీ 42మార్కులతో 5వ ర్యాంకును, ఎస్.మహేశ్వరి 41మార్కులతో 6వ ర్యాంకును సాధించారు. అన్నమయ్య జిల్లా నిమ్మనపల్లెకు చెందిన జి.భవిష్య కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగు విభాగంలో 74మార్కులతో స్టేట్ ఫస్ట్ ర్యాంకు,చిత్తూరు రైల్వే క్వార్టర్స్‌కు చెందిన వై.చైతన్య 71మార్కులతో మూడవ ర్యాంకును సాధించారు.

చిత్తూరు అమ్మాయికి మూడో ర్యాంకు



చైతన్య

చిత్తూరు (సెంట్రల్): ఏపీ పీజీ సెట్ ఫలితాల్లో కంప్యూటర్ సైన్సు ఇంజనీరింగ్ విభాగంలో చిత్తూరు రైల్వే క్వార్టర్స్‌కు చెందిన చైతన్యకు రాష్ట్ర స్థాయిలో మూడో ర్యాంకు లభించింది. ఈమె తండ్రి వెంకటేశ్వరరావు రైల్వే ఇంజనీరింగ్ విభాగంలో పనిచేస్తున్నారు. ఎన్ఐటీ రాయపూర్‌లో బీటెక్ బయో మెడికల్ చేసిన ఈమె.. పీజీ కోర్సు కోసం ఎస్వీయూ నిర్వహించిన ఏపీ పీజీ సెట్ రాశారు. ఈ ప్రవేశ పరీక్షలో 120 మార్కులకు గాను 72 మార్కులు సాధించి రాష్ట్రస్థాయిలో మూడో ర్యాంకు సాధించారు. చైతన్యకు మూడో ర్యాంకు రావడంపై కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేశారు.

ఐటీఐల్లో ప్రవేశాలకు రేపటి నుంచి ఇంటర్వ్యూలు

చిత్తూరు, జూన్ 18: జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐల్లో ప్రవేశాల కోసం దరఖాస్తులు చేసుకున్న అభ్యర్థులకు ఈ నెల 20 నుంచి 22వ తేదీ వరకు చిత్తూరు ప్రభుత్వ ఐటీఐలో ఇంటర్వ్యూలు జరుగుతాయని ప్రిన్సిపాల్ రవీంద్రరెడ్డి తెలిపారు. మెరిట్ ఆధారంగా ఇంటర్వ్యూలు ఉంటాయని, ఇదివరకే అభ్యర్థులకు కాల్ లెటర్లు, ఎస్ఎంఎస్‌లు పంపామని పేర్కొన్నారు. ఒరిజనల్ సర్టిఫికెట్లతో హాజరుకావాలని కోరారు.

ఇంటర్ సప్లిమెంటరీ ఫలితాల్లో 67 శాతం ఉత్తీర్ణత

చిత్తూరు (సెంట్రల్), జూన్ 18: ఇంటర్ సప్లిమెంటరీ ఫలితాల్లో జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల విద్యార్థులు 67 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు డీఐఈవో సయ్యద్ మౌల తెలిపారు. సెకండియర్‌లో 1,590 మందికి గాను 1,522 మంది పరీక్షలు రాయగా, 1,020 మంది పాసైనట్లు వెల్లడించారు.

రైతుల ఖాతాల్లో పీఎం కిసాన్ నిధులు

చిత్తూరు (సెంట్రల్), జూన్ 18: జిల్లాలోని రైతుల ఖాతాల్లో మంగళవారం పీఎం కిసాన్ నిధులు జమయ్యాయి. 1,75,051 మంది రైతుల ఖాతాల్లో రూ.35.01 కోట్లు జమ చేశారు. 17వ విడత పీఎం కిసాన్ నిధులను ప్రధాని మోదీ వారణాసిలో నిర్వహించిన కార్యక్రమంలో విడుదల చేశారు. ఆర్బీకేల్లో రైతులు ప్రత్యక్ష ప్రసారం వీక్షించారు.

వచ్చే నెల నుంచి రేషన్‌లో కందిపప్పు, చక్కెర



చిత్తూరు కలెక్టరేట్, జూన్ 18: తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చినవెంటనే తెల్లరేషన్ కార్డుదారులకు బియ్యంతో పాటు చక్కెర, కందిపప్పు ఇచ్చేందుకు చర్యలు చేపట్టింది. దీనివల్ల జిల్లాలో 5.43లక్షల బియ్యం కార్డుదారులకు ప్రయోజనం కలగనుంది. వైసీపీ ప్రభుత్వంలో 11 నెలలుగా కందిపప్పు పంపిణీని నిలిపేశారు. దీంతో పేదలు బహిరంగ మార్కెట్‌లో అధిక ధరలకు కందిపప్పు కొనాల్సి వచ్చింది. ఈ క్రమంలో కొత్త ప్రభుత్వం రావడం.. రేషన్ షాపుల ద్వారా 11 నెలలుగా కందిపప్పు ఇవ్వడం లేదనే విషయం సీఎంగా బాధ్యతలు చేపట్టిన చంద్రబాబు దృష్టికి వెళ్లింది. దాంతో జూలై నెల నుంచి కార్డుదారులందరికీ కందిపప్పు అందజేయాలని సీఎం ఆదేశించారు. ఈనెల 20వ తేదీ నుంచి రేషన్ షాపులకు ఉచిత బియ్యంతో పాటు కందిపప్పు, పామోలిన్ నూనె, పంచదారను సరఫరా చేయాల్సిఉంది. దీంతో పౌరసరఫరాల శాఖ అధికారులు జేసీ శ్రీనివాసులు ఆధ్వర్యంలో శని, ఆదివారాల్లో 14 ఎం.ఎల్. పాయింట్లలో నిల్వవున్న చక్కెర, పామోలిన్ ఆయిల్, కందిపప్పు నాణ్యతతో పాటు అక్కడ నిల్వవున్న ప్యాకెట్లను పరిశీలించారు. వీటిని తూకం వేసి చూడగా తరుగు వున్నట్లు గుర్తించారు. ఈ విషయమై ప్రభుత్వానికి తనిఖీల నివేదికను జేసీ పంపారు. చాలాచోట్ల అక్రమాలు తేలడంతో సరకులు సరఫరా చేసిన బాధ్యులపై చట్టప్రకారం కేసులు నమోదుచేసే ఆలోచనలో ప్రభుత్వం ఉంది. అక్రమార్కులు అందరిపైనా కేసులు పెట్టి, కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం నిర్ణయించింది.

పిడుగులతో దంచేసిన వాన

ఐరాలలో రికార్డు స్థాయిలో వర్షపాతం నమోదు



ఐరాల మండలంలో పొలాలలో నిలిచిన వర్షపు నీరు

చిత్తూరు కలెక్టరేట్, జూన్ 18: నైరుతి రుతుపవనాల ప్రభావంతో మంగళవారం జిల్లాలో వర్షం దంచేసింది. సోమవారం రాత్రి 11 గంటల నుంచి ఉదయం వరకు ఉరుములు, మెరుపులు, పిడుగులతో వర్షం కురిసింది. మంగళవారం ఒక్కరోజే జిల్లా అంతటా సరాసరి 31.9 మిమీ వర్షపాతం నమోదైంది. జూన్ నెల సగటు వర్షపాతం ఐరాలలో 91.6 మిమీ కాగా, మంగళవారం ఒక్కరోజే గరిష్ఠంగా 118.2 మిమీ నమోదైంది. అలాగే తవణంపల్లెలో 81.6 మిమీ బదులు 84.8, సోమలలో 66.1మిమీ బదులు 84.6, గంగాధరనెల్లూరులో 77.2 మిమీకి గాను 83.4 మిమీ వర్షం కురిసింది. జూన్ నెల జిల్లా సగటు వర్షపాతం 80.8 మిమీ నమోదు కావాల్సివుండగా, మంగళవారం నాటికే 138.8 మిమీ వర్షపాతం నమోదైంది. ఇక మండలాల వారీగా... పులిచెర్లలో 66.2, పూతలపట్టులో 61.8, చౌడేపల్లిలో 60.2, చిత్తూరు అర్బన్‌లో 50.8, నగరిలో 50.4, పాలసముద్రంలో 44.2, కార్వేటినగరంలో 35.4, పెనుమూరులో 31.0, విజయపురంలో 30.2, రొంపిచెర్లలో 28.4, గంగవరంలో 28.4, బంగారుపాళ్యంలో 19.2, సదుంలో 18.2, పుంగనూరులో 17.4, యాదమరిలో 16.6, చిత్తూరు రూరల్‌లో 16.4, పెద్దపంజాణిలో 15.4, గుడిపాలలో 14.4, శ్రీరంగరాజపురంలో 9.2, బైరెడ్డిపల్లెలో 8.6, వెదురుకుప్పంలో 8.4, నింద్రలో 8.2, పలమనేరులో 8.2, శాంతిపురంలో 2.0 మిమీ చొప్పున వర్షపాతం నమోదైంది.

భారీ వర్షంతో స్తంభించిన రాకపోకలు

సోమల: సోమల మండలంలో సోమవారం రాత్రి 9 నుంచి ఉదయం వరకు కురిసిన భారీ వర్షానికి పలుచోట్ల రాకపోకలు స్తంభించాయి. పెద్దఉప్పరపల్లె, అన్నెమ్మగారిపల్లె, ఆవులపల్లె, పొదలగుంటపల్లె, పేటూరు పంచాయతీల్లో భారీ వర్షం కురిసింది. పెద్దఉప్పరపల్లె- చౌడేపల్లె మార్గంలోని దేవళకుప్పం వద్ద సీతమ్మచెరువుకు వచ్చే వంకలు ప్రవహించి ఈ మార్గంలో రాకపోకలు ఆగాయి. టమోటా, మామిడి కాయలను రవాణా చేసే వాహనాలు రోడ్డుపైనే ఆగిపోయాయి.



ప్రవహిస్తున్న సీతమ్మచెరువు వంక

ఇంటర్ ద్వితీయ సప్లిమెంటరీలో
59శాతం ఉత్తీర్ణత

ఫస్టియర్, బెటర్‌మెంట్ ఫలితాలు 26న

ఇకపై రీకౌంటింగ్ ఉండదన్న అధికారులు

అమరావతి, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షల్లో ద్వితీయ సంవత్సరంలో 59శాతం ఉత్తీర్ణత నమోదైంది. ఆన్‌లైన్ మూల్యాంకనంతో జరిగిన జాప్యం వల్ల కేవలం ద్వితీయ సంవత్సరం సప్లిమెంటరీ ఫలితాలను ఇంటర్ విద్యామండలి మంగళవారం విడుదల చేసింది. కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ వీవీ సుబ్బారావు వివరాలు వెల్లడించారు. జనరల్ కోర్సుల విద్యార్థులు 115319 మంది పరీక్షలు రాయగా 68070(59శాతం) ఉత్తీర్ణులయ్యారని, ఒకేషనల్ విద్యార్థులు 11871 మందికిగాను 6798(57శాతం) ఉత్తీర్ణత సాధించారని వివరించారు. మొత్తంగా 58.86శాతం ఉత్తీర్ణత నమోదైందని తెలిపారు. కేటగిరీల వారీగా చూస్తే అబ్బాయిలు 59శాతం, అమ్మాయిలు 58శాతం మంది పాసయ్యారు. ఈ ఏడాది పబ్లిక్ పరీక్షలతో కలిపి చూస్తే జనరల్ విద్యార్థులు 87శాతం మంది, ఒకేషనల్ విద్యార్థులు 84శాతం మంది సెకండియర్‌లో ఉత్తీర్ణులై బయటకు వెళ్లారని తెలిపారు. ఈ ఏడాది సప్లిమెంటరీ పరీక్షలను ఆన్‌లైన్ విధానంలో మూల్యాంకనం చేశామని, అందువల్ల రీకౌంటింగ్ ఉండదని పేర్కొన్నారు. డిజిటల్ విధానంలో కౌంటింగ్ పొరపాట్లు రావన్నారు. రీవెరిఫికేషన్ కావాలంటే ఈనెల 20 నుంచి 25లోగా దరఖాస్తు చేసుకోవాలని, ఒక్కో పేపరుకు రూ.వెయ్యి ఫీజు చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. ఇకపై రెగ్యులర్ పరీక్షల మూల్యాంకనం కూడా ఆన్‌లైన్‌లోనే చేయనున్నట్లు వివరించారు. సప్లిమెంటరీ ఉత్తీర్ణతలో జిల్లాల వారీగా చూస్తే జనరల్ కేటగిరీలో పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, పల్నాడు జిల్లాలు టాప్‌లో ఉన్నాయి. పశ్చిమ గోదావరి, కోనసీమ, కృష్ణా జిల్లాలు చివరన నిలిచాయి. ఒకేషనల్‌లో పార్వతీపురం మన్యం, నెల్లూరు, శ్రీకాకుళం ముందుండగా, కడప, కర్నూలు, విశాఖపట్నం అట్టడుగున ఉన్నాయి. కాగా ఫస్టియర్ సప్లిమెంటరీ, బెటర్‌మెంట్ ఫలితాలను ఈనెల 26న విడుదల చేస్తామని తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో వివాహిత మృతి


మౌనిక (ఫైల్ ఫొటో)

తవణంపల్లె, జూన్ 18: వివాహిత అనుమానాస్పదంగా మృతిచెందిన ఘటన తవణంపల్లెలో మంగళవారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. తవణంపల్లెకు చెందిన అరుణకుమార్ ఎగువతవణంపల్లె అరుధంతివాడకు చెందిన మౌనిక(22)ను నాలుగేళ్ల క్రితం ప్రేమించి పెళ్లిచేసుకున్నాడు. వీరికి 18 నెలల కుమార్తె ఉంది. తవణంపల్లెలో బాడుగ ఇంట్లో కాపురముంటున్నారు. సోమవారం సాయంత్రం భర్త ఇంట్లోలేని సమయంలో మౌనిక ఫ్యానుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. గ్రామస్థుల సమాచారం మేరకు పోలీసులు అక్కడికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు.అల్లుడిపై అనుమానం ఉందని మృతురాలి తల్లి సంధ్యాదేవి ఇచ్చిన ఫిర్యాదుమేరకు కేసునమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వయోవృద్ధుల దర్శనంపై
పుకార్లను నమ్మొద్దు : టీటీడీ

తిరుమల, జూన్18(ఆంధ్రజ్యోతి):తిరుమలలో వయోవృద్ధుల దర్శనానికి సంబంధించి తప్పుదోవ పట్టించే కొన్ని వార్తలు సోషల్‌మీడియాలో చక్కర్లు కొడుతున్నాయని టీటీడీ మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొంది. ' రోజూ వెయ్యిమంది వయోవృద్ధులకు, దివ్యాంగులకు దర్శనాలకు సంబంధించి టీటీడీ ప్రతి నెలా 23వ తేది మధ్యాహ్నం 3 గంటలకు మూడు నెలల ముందుగానే ఆన్‌లైన్ కోటాను విడుదల చేస్తోందని తెలిపింది. ప్రస్తుతం ఆన్‌లైన్ టికెట్లు ఆగస్టు నెల వరకు బుక్కయ్యాయని పేర్కొంది. టికెట్ పొందిన వ్యక్తికి రూ.50విలువ చేసే లడ్డూ ఉచితంగా లభిస్తుందని,తిరుమల నంబి ఆలయానికి ఆనుకుని ఉన్న సీనియర్ సిటిజన్(పీహెచ్‌సీ) లైన్ ద్వారా రోజూ మధ్యాహ్నం 3 గంటలకు శ్రీవారి దర్శనానికి అనుమతిస్తారని వివరించింది.కాబట్టి సోషల్‌మీడియాలో ప్రచారమవుతున్న తప్పుడు వార్తలను నమ్మవద్దని టీటీడీ కోరింది. దీనికి సంబంధించిన వివరాల కోసం 'తిరుమల. ఓఆర్జీ', 'టీటీదేవస్థానమ్స్.ఏపీ.జీవోవీ.ఇన్' అనే వెబ్‌సైట్లను సంప్రదించాలని సూచించింది.

నేటినుంచి శ్రీవారి జ్యేష్ఠాభిషేక ఉత్సవాలు

తిరుమల, జూన్18(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి ఆలయంలో బుధవారం నుంచి మూడురోజుల పాటు జ్యేష్ఠాభిషేక ఉత్సవాలు జరుగనున్నాయి. అభిషేకాలు, పంచామృత స్నపన తిరుమంజనాల కారణంగా శ్రీదేవి, భూదేవి సమేత మలయప్పస్వామి ఉత్సవమూర్తులు అరిగిపోకుండా జాగ్రత్తలు తీసుకునేందుకు వైఖానస ఆగమోక్తంగా నిర్వహించే ఉత్సవమే జ్యేష్ఠాభిషేకం. మొదటిరోజు ఉత్సవమూర్తులకు హోమాలు, అభిషేకాలు, పంచామృత స్నపనతిరుమంజనం నిర్వహిస్తారు. తర్వాత స్వామి, అమ్మవార్లకు వజ్రకవచాన్ని అలంకరించి మాడవీధుల్లో ఊరేగిస్తారు. రెండవరోజు ముత్యాల కవచ సమర్పణ చేసి ఊరేగిస్తారు. మూడవరోజు కూడా తిరుమంజనాదులు పూర్తిచేసి బంగారు కవచాన్ని సమర్పించి ఊరేగింపు నిర్వహిస్తారు. ఈ బంగారు కవచాన్ని మళ్లీ వచ్చే ఏడాది జ్యేష్ఠాభిషేకంలోనే తీస్తారు. అంతవరకూ శ్రీదేవి, భూదేవి సమేత మలయప్పస్వామి బంగారు కవచంతోనే ఉంటారు. కాగా, జ్యేష్ఠాభిషేకం కారణంగా శ్రీవారి ఆలయంలో జూన్21వ తేదీ కల్యాణోత్సవ, ఊంజల్‌సేవ, ఆర్జితబ్రహ్మోత్సవ సేవలను టీటీడీ రద్దు చేసింది. తోమాల, అర్చన సేవలను ఏకాంతంగా నిర్వహిస్తారు.

24 నుంచీ ఏపీఆర్‌సెట్ ఇంటర్వ్యూలు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూన్ 18: రాష్ట్రంలోని యూనివర్సిటీల్లో పీహెచ్‌డీ ప్రవేశానికి నిర్వహించిన ఏపీఆర్‌సెట్ ఇంటర్వ్యూలు ఈ నెల 24 వ తేదీ నుంచీ చేపట్టనున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలను ఏపీఆర్‌సెట్ కన్వీనర్ ప్రొఫెసర్ బి. దేవప్రసాదరాజు మంగళవారం తిరుపతిలో వెల్లడించారు. 24 నుంచీ 28 వ తేదీ వరకూ ఇంటర్వ్యూల ప్రక్రియను నిర్వహిస్తామన్నారు. రాష్ట్రంలోని ఎంపిక చేసిన 12 యూనివర్సిటీల్లో ఇంటర్వ్యూలు చేపడుతున్నట్టు తెలిపారు. 10 వేల మంది ప్రవేశ పరీక్షలకు దరఖాస్తు చేయగా, ఇందులో 4,352మంది ఉత్తీర్ణత సాధించారని చెప్పారు. ఉ త్తీర్ణులైన వారికి ఆయా యూనివర్సిటీల్లోని సంబంధిత డిపార్ట్‌మెంట్లలోనే ఇంటర్వ్యూ లు జరుగుతాయన్నారు. సమగ్ర వివరాల కోసం.. హెచ్‌టీటీపీఎస్.సెట్స్‌ఏపీఎస్‌సీహెచ్‌ఈ.ఏపీ.గవర్నమెంట్, ఇన్.. వెబ్‌సైట్ చూడాలని కన్వీనర్ దేవప్రసాదరాజు కోరారు.

‘కౌండిన్య’ నిండా గుంతలే

నిషేధమున్నా ఆగని ఇసుక తవ్వకం ● ప్రభుత్వం మారినా చెలరేగుతున్న స్మగ్లర్లు

కౌండిన్య నది నిండా గుంతలే. ఇసుక కోసం బావులను తలపించేలా యంత్రాలతో తవ్వేశారు. పక్క రాష్ట్రాలకు అక్రమంగా తరలించారు. లీజు కాలం ముగియడంతో రీచుల్లోను, ఎక్కడా ఇసుక తీయరాదని.. అలా చేస్తే చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు. మరోవైపు ప్రభుత్వమూ మారింది. అయినా ఇసుకాసురులు చెలరేగిపోతూనే ఉన్నారు.
- పలమనేరు



పలమనేరు సమీపంలో కౌండిన్య నదిలో ఇసుక తోడేయడంతో అడ్రస్ లేకుండా పోయిన చెక్‌డ్యామ్ ఉన్న ప్రదేశం - గుంతలు పడిన కౌండిన్య నది

పలమనేరు, గంగవరం మండలాల్లో ప్రవహిస్తున్న కౌండిన్య నది నుంచి ఇసుక స్మగ్లింగ్ ఆగడం లేదు. ప్రభుత్వం మారినా అక్రమ రవాణా సాగుతూనే ఉంది. దొంగలు దొంగలు ఊర్లు పంచుకొన్నట్లు ఇసుక స్మగ్లర్లు కౌండిన్య నదిని పంచుకొని యథేచ్ఛగా గత నాలుగేళ్లగా ఇసుక అక్రమ రవాణా సాగిస్తున్నారు. కేవలం మూడు కిలోమీటర్ల దూరంలో ఇసుక అక్రమ రవాణా సాగుతున్నా ఆర్డీఓ, తహసిల్దార్, పోలీసు స్టేషన్లు, భూగర్భ జల వనరుల శాఖ అధికారి కార్యాలయాలున్నా పట్టించుకోలేదు. దశాబ్ద కాలంగా ఇసుక అక్రమ రవాణాకు అలవాటు పడిన కొందరు.. ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆపార్టీ నాయకులు, ప్రజాప్రతినిధుల అండతో చెలరేగిపోతున్నారు. గత ప్రభుత్వ హయాంలో పలమనేరు మున్సిపాలిటీలోని ఇద్దరు మహిళా కౌన్సిలర్ల భర్తలు ప్రతిరోజు కౌండిన్య నదిలో నీళ్లున్నా ఎక్స్‌కవేటర్ల సాయంతో ఇసుకను నీటినుంచి తోడి ట్రాక్టర్లలో నింపుకొంటూ అక్రమ రవాణా చేస్తూ వచ్చారు. పలమనేరు గ్రామ పంచాయితీ స్థాయిలో ఉన్నప్పుడు ఈ కౌండిన్య నదిలో పట్టణానికి తాగునీటి సరఫరా కోసం బోర్లు వేసి పంప్ హౌస్ నిర్మించారు. అంతేకాక ఈ పంప్ హౌస్‌సమీపంలో చెక్‌డ్యామ్ కూడా నిర్మించారు. ఈ చెక్ డ్యాంలో నీరు నిల్వ ఉన్నందున పంప్ హౌస్ వద్ద ఏర్పాటు చేసిన బోర్లలో పుష్కలంగా నీరు లభించేది. వేసవిలోనూ తాగునీటి సమస్య తలెత్తేది కాదు. గత ప్రభుత్వ హయాంలో అధికార పార్టీ నేతలే ఇసుక స్మగ్లింగ్ చేపట్టారు. ఒక ట్రాక్టరు ఇసుక రూ. 1500 పలుకుతున్న సమయంలో వీరు.. ధరను రూ.3500 నుంచి రూ.4 వేలకు పెంచేశారు. దీంతో గృహనిర్మాణదారులు గత్యంతరం లేక వీరి వద్దనే ఇసుకను కొనుగోలు చేసేవారు. మరి కొందరు సంపన్నులు మాత్రం చిత్తూరు సమీపం నుంచి టిప్పర్లలో ఇసుకను రూ. 24వేలనుంచి రూ. 27 వేల వరకు కొనుగోలు చేసి ఇంటి నిర్మాణాలకు వినియోగించుకొన్నారు. ఇక గంగవరం మండలంలోని నల్లగుట్లపల్లి, జీడిమాకులపల్లి, కొంగోళ్ల పల్లి, చెన్నారెడ్డిపల్లి గ్రామాల్లో కొందరు రైతులూ ఇసుక అక్రమ రవాణాకు శ్రీకారం చుట్టారు. వీళ్లూ కౌండిన్య నదిలో ఇసుకను తరలించి లక్షలాది రూపాయలు సొమ్ము చేసుకొన్నారు. కాగా, ఇసుక అక్రమ రవాణాను అడ్డుకోకుండా వీరు అధికారులతో 'ఒప్పందం' కుదుర్చుకున్నారన్న విమర్శలున్నాయి. మరోవైపు ఇసుకాసురులు తమలో తాము పోటీ పడకుండా కౌండిన్య నదిని ఎవరికి వారు పంచుకుని హద్దులు పెట్టుకున్నారు. ఆ ప్రాంతాల్లో మాత్రమే ఇసుక తవ్వి.. తరలిస్తున్నారు. వీరిలో కొందరు ఎన్నికల ముందు వైసీపీని వీడి తెలుగుదేశం పార్టీలో చేరారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్


గంగవరం మండలం కురప్పల్లి వద్ద మంగళవారం ఇసుక తరలిస్తుండగా పట్టుబడిన ఇసుక ట్రాక్టర్

రాష్ట్రంలో అధికారం మారిందనో లేదా ఇక్కడి పోలీసులకు ఇసుక అక్రమ రవాణా నేరమని ఇప్పటికి తెలిసిందో ఏమోగానీ.. మంగళవారం ఇసుక ట్రాక్టరును పట్టుకున్నారు. గంగవరం మండలం చెన్నారెడ్డిపల్లి గ్రామానికి చెందిన ఒక ట్రాక్టరులో ఇసుక అక్రమంగా తరలిస్తుండగా కురప్పల్లి గ్రామం వద్ద పట్టుకొని ట్రాక్టర్‌ను స్టేషన్‌కు తరలించారు. మరి ఈ అక్రమ రవాణా పై పోలీసులు కేసు నమోదు చేస్తారా లేదా అనేది చూడాలి. గతంలో ఇసుక అక్రమ రవాణాపై పత్రికల్లో వార్తలు వచ్చిన ప్రతిసారి పోలీసులు ట్రాక్టర్లను పట్టుకొని అమాయకులైన డ్రైవర్లపై కేసులు పెట్టి చేతులు దులుపుకొంటూ వచ్చారు. అంతేగానీ ఇసుక అక్రమ రవాణా సూత్రధారులపై కేసుల్లేవు.

టీడీపీ అడ్డుకున్నా..

పంపు హౌస్ సమీపంలో రెండేళ్ల కిందట ఇసుక తవ్వి ట్రాక్టర్లలో తరలిస్తుండగా తెలుగుదేశం పార్టీ నాయకులు అడ్డుకొన్నారు. వీరి ఫిర్యాదులను పోలీసులు పట్టించుకోలేదు. ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయకుండా.. ఇసుక ట్రాక్టర్లను అడ్డుకోనేందుకు మీకేం అధికారం ఉందని, మీమీదే కేసులు పెడతామంటూ టీడీపీ వారినే బెదిరించారు. ఇసుక స్మగ్లర్లకు, పోలీసులకు ఎంత సన్నిహిత సంబంధాలు ఉన్నాయో ఈ ఘటనే ఓ ఉదాహరణ.

కొంగోళ్లపల్లి విద్యార్థులకు దారిలేకుండా..

గంగవరం మండలం కొంగోళ్లపల్లి గ్రామానికి చెందిన విద్యార్థులు గతంలో కౌండిన్య నది దాటుకొని కేవలం కిలో మీటరు దూరంలోని కేటిల్‌ఫారం ఉన్నత పాఠశాలకు వెళ్లేవారు. నదిలో ఇసుక తోడేయడంతో భారీ గుంతలు ఏర్పడ్డాయి. వీటిని దాటేందుకు వీల్లేని పరిస్థితి. దీంతో తమ గ్రామానికి చెందిన విద్యార్థులు కనీసం మూడు కిలోమీటర్లు నడిచి పాఠశాలకు వెళ్లే దుస్థితి నెలకొందని ఆ గ్రామస్థులు ఆవేదన వ్యక్తంచేశారు.

అన్న క్యాంటీన్ పునఃప్రారంభానికి చర్యలు తీసుకోండి

● అధికారులకు కలెక్టర్ ఆదేశాలు.. కుప్పం అభివృద్ధిపై సమీక్ష


అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్

కుప్పం, జూన్ 18: కుప్పంలో మూతపడ్డ అన్న క్యాంటీన్ పునరుద్ధరణకు చర్యలు తీసుకోవాలని అధికారులను కలెక్టర్ ఎస్.షన్మోహన్ ఆదేశించారు. ఆర్‌అండ్‌బీ అతిథి భవనాన్ని పూర్తిగా ఆధునికీకరించాలన్నారు. కుప్పంలో మంగళవారం కలెక్టరు పర్యటించారు. ఆర్ అండ్ బీ గెస్ట్ హౌస్‌లో చంద్రబాబు వచ్చినపుడు బస చేసే సూట్, ఇతర వీఐపీ గదులను పరిశీలించారు. అతిథి గృహాన్ని ఆధునికీకరించడంతో పాటు సరికొత్త ఫర్నిచర్ తెప్పించాలన్నారు. పాత తహసీల్దారు కార్యాలయ ఆవరణలోని అన్న క్యాంటీన్ భవనాన్ని పరిశీలించారు. త్వరలోనే పునః ప్రారంభించడానికి అవసరమైన పనులు ప్రారంభించాలన్నారు. వివిధ విభాగాలకు చెందిన అధికారులతో కలెక్టర్ సమావేశమయ్యారు. కుప్పం అభివృద్ధిపై సమీక్షించారు. ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, ఆర్అండ్ ఎస్ఈ ఉమామహేశ్వర్ రెడ్డి, ఆర్డీవో శ్రీనివాసులు, ఆర్‌అండ్‌బీ ఈఈ స్టాబ్లి జోస్, రెస్కో ఎండీ ప్రభాకర్, డీఎస్పీ శ్రీనాథ్, మున్సిపల్ కమిషనర్ నాగేశ్వరరావు, తహసీల్దారు హరికుమార్ తదితరులు పాల్గొన్నారు.

గజదాడుల నిరోధానికి పటిష్ఠ చర్యలు : సీసీఎఫ్


కన్నానాయక్ కుటుంబసభ్యులను పరామర్శిస్తున్న సీసీఎఫ్ నాగేశ్వరరావు

రామకుప్పం, జూన్ 18: కౌండిన్య అభయారణ్యం పరిధిలో పంటలు, జనావాసాలపై ఏనుగుల దాడుల నిరోధానికి పటిష్ఠ చర్యలు చేపడతామని అనంతపురం అటవీ రేంజ్ చీఫ్ కన్జర్వేటర్ నాగేశ్వరరావు తెలిపారు. మంగళవారం ఆయన జిల్లా అటవీ అధికారి చైతన్య కుమార్‌తో కలిసి రామకుప్పం మండలం పీఎంకేతాండాలో పర్యటించారు. ఇటీవల ఒంటరి ఏనుగు దాడిలో మృతి చెందిన కన్నానాయక్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఇప్పటికే మృతుడి కుటుంబానికి ప్రభుత్వం రూ.5లక్షల ఆర్థికసాయం అందించినట్లు గుర్తుచేశారు. ఐదేళ్లుగా నిర్వహణ లోపం కారణంగా కందకాలు పూడిపోయాయని, సోలార్ విద్యుత్ కంచె ధ్వంసమైందన్నారు. దీంతో ఏనుగులు యథేచ్ఛగా జనావాసాల్లోకి వస్తున్నాయన్నారు. ఏనుగు దాడిలో కన్నానాయక్ మృతి చెందడం పట్ల సీఎం చంద్రబాబు తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారన్నారు. అడవి నుంచి ఏనుగులు బయటకు రాకుండా చర్యలు తీసుకోవాలని తమను ఆదేశించారన్నారు. కందకాల్లో పూడిక తీయడానికి, సోలార్ విద్యుత్ కంచె పునరుద్ధరణకు ప్రణాళికలను సిద్ధం చేస్తున్నామన్నారు. ఏనుగుల సంచారాన్ని పసిగట్టే ట్రాకర్ల సంఖ్యను పెంచాలని టీడీపీ నేతలు ఆనందరెడ్డి, విశ్వనాథ్, గంట్లప్పగౌడు, కృష్ణానాయక్ కోరారు. ఈ కార్యక్రమంలో కుప్పం అటవీ క్షేత్రాధికారి జయశంకర్, ఉపక్షేత్రాధికారి పుల్లయ్య, విభాగాధికారి బాబుప్రసాద్ తదితరులున్నారు.

గంజాయి బ్యాచ్‌లపై కేసులు

మరికొందరికి కౌన్సెలింగ్

తిరుపతి(నేరవిభాగం), జూన్ 18: గంజాయి, బహిరంగంగా మద్యం తాగుతున్న వారిపై పోలీసు శాఖ ఉక్కుపాదం మోపుతోంది. రెండ్రోజుల వ్యవధిలోనే దాదాపు 250 మంది గంజాయి, బహిరంగంగా మందు తాగే బ్యాచ్‌లను అదుపులోకి తీసుకుని కేసులు నమోదు చేశారు. ఈస్ట్ పోలీసుస్టేషన్‌లో మంగళవారం రిసెప్షన్ కౌంటర్లు, లాకప్ గదులు గంజాయి, బహిరంగంగా మద్యం తాగిన వారితో నిండిపోయాయి. వీరందరికీ పోలీసులు కౌన్సెలింగ్ ఇస్తున్నారు. మళ్లీ రోడ్లపై మందు తాగుతూ కనిపించినా, గంజాయి విక్రయాలు చేసినా క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

కొత్తయిండ్లు మున్సిపల్ పాఠశాలకు
పోటెత్తిన విద్యార్థులు


విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడుతున్న హెచ్‌ఎం సుబ్రహ్మణ్యం

పుంగనూరు రూరల్, జూన్ 18: పుంగనూరులోని కొత్తయిండ్లు మున్సిపల్ పాఠశాలలో తమ పిల్లలను చేర్చేందుకు తల్లిదండ్రులు క్యూ కడుతున్నారు. పాఠశాలలో 750మంది విద్యార్థులకు చదువుకోవడానికి మౌళిక వసతులు ఉన్నప్పటికీ ఇప్పటికే దాదాపు 1000మందికిపై విద్యార్థులు ఉన్నట్లు ఉపాధ్యాయులు తెలిపారు. 6వ తరగతిలోనే ఇప్పటికి 150 మంది చేరినట్లు హెచ్‌ఎం సుబ్రహ్మణ్యం చెప్పారు. పాఠశాలలో పిల్లలను చేర్చేందుకు ప్రజాప్రతినిధుల సిఫార్సులు పెరగడంతో ఉపాధ్యాయులు ఇబ్బంది పడుతున్నారు. విద్యార్థులకు విద్యాబోధన చేయాలంటే దాదాపు 44మంది ఉండాలి. కానీ 23మంది ఉపాధ్యాయులే ఉన్నారు. ఉన్నతాధికారులు పాఠశాలకు ఉపాధ్యాయులను నియమించి ఉన్నత ఫలితాలు సాధించేందుకు తోడ్పాటు అందించాల్సిన అవసరముంది.

కిలో టమోటా రూ.60

పుంగనూరు, జూన్ 18: పుంగనూరు వ్యవసాయ మార్కెట్ యార్డులో మంగళవారం కిలో టమోటా ధర రూ.60 పలికింది. సోమవారం రూ.56.70కి పలకగా మంగళవారం రూ. 60పెరిగింది. రెండో రకం కిలో రూ. 55.40, మూడవ రకం కిలో రూ. 50 చొప్పున రైతుల నుంచి వ్యాపారస్తులు కొనుగోలు చేసి డిమాండ్ ఉన్న ప్రాంతాలకు పుంగనూరు మార్కెట్‌కు వచ్చిన 333.84 మెట్రిక్ టన్నులు తరలించారు.

రియాలిటీ హాట్ స్పాట్ సిటీగా తిరుపతి



దేశవ్యాప్తంగా 17 ప్రతిపాదిత నగరాలు

దక్షిణాదిన 4 నగరాల్లో తిరుపతికి చోటు

తిరుపతి, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రాలుగా విలసిల్లుతున్న 17 నగరాలు రానున్న కాలంలో రియల్ ఎస్టేట్ రంగంలో శరవేగంగా అభివృద్ధి చెందడానికి అవకాశముందని కొలియర్స్ ఇండియా సంస్థ ప్రకటించిన జాబితాలో తిరుపతికి చోటు దక్కింది. రియల్ ఎస్టేట్ రంగంలో విశేష పేరు ప్రఖ్యాతులున్న ఈ సంస్థ దేశవ్యాప్తంగా అధ్యయనం నిర్వహించి రూపొందించిన నివేదికను తాజాగా విడుదల చేసింది. దీనికోసం దేశం మొత్తం మీద రియల్ ఎస్టేట్‌పరంగా అత్యధిక గ్రోత్ రేట్ వున్న వందకు పైగా నగరాలలో అధ్యయనం కొనసాగించింది. వాటిలో ముందు వరుసలో నిలిచిన 30 నగరాలను ఎంపిక చేయగా అందులో ఆధ్యాత్మిక పర్యాటక రంగం కేటగిరీ కింద 17 నగరాలను గుర్తించింది. ఈ 17 నగరాల్లో అయోధ్య, వారణాసి, పూరి, ద్వారక, షిర్డి, అమృత్‌సర్ తదితరాలతో పాటు తిరుపతి కూడా వుండడం గమనార్హం. ఇక్కడ ఆధ్యాత్మిక పర్యాటకం, మౌలిక సదుపాయాల కల్పన ప్రాజెక్టులు వంటివి అభివృద్ధి చెందడానికి అవకాశముందని కొలియర్స్ సంస్థ అభిప్రాయపడింది. వీటి మూలంగా రియల్ ఎస్టేట్ రంగం సైతం గరిష్టంగా అభివృద్ధి చెందడానికి వీలు కలుగుతుందని అంచనా వేసింది. రియల్ ఎస్టేట్ హాట్ స్పాట్ సిటీస్‌గా ఒకటిగా సంబంధిత సంస్థ గుర్తించిన తిరుపతి దేశవ్యాప్తంగా ఎంపిక చేసిన 17 నగరాల్లో ఒకటి కాగా అదే దక్షిణ భారతదేశం నుంచీ ఎంపికైన నాలుగు నగరాల్లో ఒకటి కావడం విశేషం. దక్షిణాదిన కోయంబత్తూరు, కొచ్చిన్, తిరుపతి, విశాఖపట్టణం ఎంపికయ్యాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మౌలిక సదుపాయాలను మెరుగుపరచడం, రోడ్డు కనెక్టివిటీని పెంచడం, నూతన విమానాశ్రయాలను ఏర్పాటు చేయడం, ప్రత్యేక రైలు సర్వీసులు నడపడం వంటి చర్యలు తీసుకుంటే దీర్ఘకాలికంగా అటు ఆతిధ్య రంగంలోనూ, ఇటు రియల్ ఎస్టేట్ రంగంలోనూ అనూహ్య అభివృద్ధి సాధ్యమవుతుందని కొలియర్స్ ఇండియా సంస్థ భావిస్తోంది.

ఇప్పటికే ఊపందుకున్న నగర విస్తరణ

ఇప్పటికే తిరుపతి నగరం అర్బన్ మండల పరిధిని దాటి రూరల్ మండలం, చంద్రగిరి, రేణిగుంట, వడమాలపేట, రామచంద్రాపురం, ఏర్పేడు మండలాల్లోకి విస్తరించిన సంగతి తెలిసిందే. తిరుపతి కేంద్రంగా పరిసరాల్లోని ఈ మండలాల్లోకి నగరం వేగంగా విస్తరిస్తుండడంతో ఆయా ప్రాంతాల్లో రియల్ ఎస్టేట్ వెంచర్లు ఊపందుకుంటున్నాయి. తిరుపతి నుంచీ కడప, నెల్లూరు, చెన్నై, చిత్తూరు, మదనపల్లె వెళ్ళే మార్గాలు జాతీయ రహదారులు కావడం రియల్ ఎస్టేట్ రంగం అభివృద్ధి చెందడానికి ఊతమిస్తోంది. తిరుపతి ప్రముఖ పుణ్యక్షేత్రం కావడంతో పాటు చుట్టుపక్కల అనేక చారిత్రక, ఆధ్యాత్మిక ప్రాధాన్యత కలిగిన ఆలయాలు వుండడంతో పలువురు ఉన్నత స్థాయి వ్యక్తులు సైతం విశ్రాంత జీవితాన్ని తిరుపతి, తిరుపతి పరిసరాల్లో గడిపేందుకు ప్రాముఖ్యత ఇస్తున్నారు. దీనివల్ల ఇక్కడ స్థలాలు కొనుగోలు చేసి నివాసాలు ఏర్పరుచుకోవడం, అపార్టుమెంట్లలో ఫ్లాట్లు కొనుగోలు చేయడం క్రమేపీ పెరుగుతోంది. దీనివల్ల అపార్టుమెంట్ల సంఖ్య కూడా ఇబ్బడిముబ్బడిగా పెరిగిపోతోంది. తాజాగా కొలియర్స్ ఇండియా సంస్థ వేసిన అంచనాల ప్రకారం చూస్తే రానున్న కాలంలో నగర విస్తరణ మరో స్థాయిని అందుకోవడం ఖాయమనిపిస్తోంది.

నారా లోకేశ్‌ను కలిసిన పుంగనూరు నాయకులు



పుంగనూరు, జూన్18: మంత్రి నారా లోకేశ్‌ను పుంగనూరు టీడీపీ నాయకులు వెంకటరమణరాజు, మురాధి దినేశ్‌లు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. మంగళవారం విజయవాడలోని ఆయన స్వగృహంలో కలిశారు. ఈ సందర్భంగా ఆయన పుంగనూరు నియోజకవర్గ పరిస్థితులపై ఆరా తీసినట్లు తెలిపారు.

టీడీపీలోనే బీసీలకు గుర్తింపు



సంబరాలు చేస్తుకుంటున్న నాయకులు

పుంగనూరు, జూన్ 18: తెలుగుదేశం పార్టీలోనే బడుగు బలహీన వర్గాలకు గుర్తింపు వచ్చిందని టీడీపీ నాయకులు వెంకటమునియాదవ్, అప్పిరెడ్డి యాదవ్ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక ఎన్టీఆర్ సర్కిల్లో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడిగా శ్రీనివాసయాదవ్‌ను నియమించడం హర్షణీయమన్నారు. టీడీపీ వ్యవస్థాపకుడు ఎన్టీఆర్ పార్టీ ఆవిర్భావం నుంచి యాదవ కులస్తులకు గుర్తింపు ఇస్తున్నట్లు పేర్కొన్నారు. బీసీలకు మంత్రి వర్గంలోనూ సముచిత స్థానం కల్పించిన సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. నాయకులు రమణ, రాము, వెంకటేశ్ పాల్గొన్నారు.

బడి ఈడు పిల్లలను బడిలో చేర్పించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈవో లక్ష్మయ్య

గుడుపల్లె, జూన్ 18: బడి ఈడు పిల్లలను గుర్తించి బడిలో చేర్పించాలని ఎంఈవో లక్ష్మయ్య ఉపాధ్యాయులకు సూచించారు. మంగళవారం మండల కార్యాలయంలో అధికారులతో, ఉపాధ్యాయులతో 'నేను బడికి పోతా' కార్యక్రమంపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లలకు స్టూడెంట్ కిట్, విద్యా ప్రోత్సాహకాలను అందించాలని కోరారు. ఎంఈవో శ్రీదేవి, డీటీ కిరణ్‌కుమార్ నాయక్, ఈవోపీఆర్డీ శంకర్, ఐసీడీఎస్ అరుణ, సచివాలయ అధికారులు పాల్గొన్నారు.

బైరెడ్డిపల్లె: బడిబయట పిల్లలను బడిలో చేర్పించాలని విద్యాశాఖ ఆధ్వర్యంలో బైరెడ్డిపల్లెలో ర్యాలీ నిర్వహించారు. ఎంపీడీవో రాజేష్, ఈవోఆర్డీ రాజేంద్రబాలాజీ, ఎంఈవో -2 సుబ్రమణ్యం, ఐసీడీఎస్ అధికారులు రమాదేవి, లత, కేజీబీవీ ఎస్వో స్వరూప తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా మిట్టూరు గంగమ్మ జాతర

గుడుపల్లె, జూన్ 18: మండల పరిధిలోని మిట్టూరు గ్రామంలో గంగమ్మ జాతర మంగళవారం వైభవంగా జరిగింది. ఉదయం ఆలయంలో అమ్మవారి మూల విగ్రహానికి పూజారులు అభిషేకాలు, పూజలు చేసి ప్రత్యేక పుష్పాలతో అలంకరించారు. మహిళలు పిండిదీపాలతో మంగళవాయిద్యాలతో ఊరేగింపుగా ఆలయ ప్రాంగణానికి చేరుకున్నారు. పొంగళ్లు పెట్టి, పిండిదీపాల వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. వర్షాలు సకాలంలో పడి పంటలు బాగా పండాలని వేడు కున్నారు. అనంతరం అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని రంగు రంగు పుష్పాలతో అలంకరించి మంగళ వాయిద్యాలతో గ్రామ పురవీధుల్లో ఊరేగించారు. మహిళలు అమ్మవారికి కర్పూర హారతులు సమర్పించారు. ఈ ఉత్సవాన్ని తిలకించేందుకు చుట్టుపక్కల గ్రామాల నుంచి ప్రజలు తరలివచ్చారు.

విద్యా సామగ్రి పంపిణీ

చౌడపల్లె, జూన్18: మండలంలోని 29-ఏ చింతమాకులపల్లెలో బీసీవై అధినేత రామచంద్రయాదవ్ జన్మదిన వేడుకలను ఆ పార్టీ నాయకులు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా ఎంపీపీ స్కూల్లో విద్యార్థులకు పుస్తకాలు, విద్యాసామగ్రి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బీసీవై నాయకులు హరిప్రసాద్ యాదవ్ కుమ్మరి గిరిబాబు, సత్యయాదవ్, భరత్‌కుమార్ పాల్గొన్నారు.

ఇంటిపట్టాలను రద్దు చేయాలని వినతి

రామకుప్పం, జూన్ 18: రామకుప్పం మండలం పంచాయతీ కేంద్రం 89పెద్దూరులో అంగన్వాడీ, పశువైద్య కేంద్ర భవనాల నిర్మాణం కోసం కేటాయించిన స్థలంలో కేటాయించిన ఇంటి పట్టాలను రద్దు చేయాలని గ్రామస్తులు మంగళవారం తహసీల్దారు శ్రీధర్‌కు వినతిపత్రం అందజేశారు. తొమ్మిది నెలల క్రితం ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు ఆ స్థలంలో 12మందికి ఇంటిపట్టాలు ఇచ్చారన్నారు. కానీ అక్కడ ఉన్న స్థలం అందరికీ చాలక పోవడంతో వారిలో వారు తరచూ గొడవలు పడుతున్నారన్నారు. అధికారులు స్పందించి పట్టాలు రద్దు చేసి, ఆ స్థలాన్ని అంగన్వాడీ కేంద్రం, పశువైద్య కేంద్ర భవనాల నిర్మాణానికి కేటాయించాలని కోరారు. ఇళ్లులేని పేదలకు మరో చోట ఇంటి స్థలాలు కేటాయించాలని విన్నవించారు.

భక్తిశ్రద్ధలతో సర్పదోష నివారణ పూజలు

రామకుప్పం, జూన్ 18: రామకుప్పం శివార్లలోని వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో మంగళవారం సర్పదోష నివారణ పూజలు జరిగాయి. ఆలయ నిర్వాహకులు భక్తులకు అన్నప్రసాదాలతో పాటు మజ్జిగ పంపిణీ చేశారు.

టీడీపీలో చేరిన మైనారిటీ నాయకుడు



బైరెడ్డిపల్లె, జూన్ 18 : మండలంలోని తీర్థం గ్రామానికి చెందిన మైనారిటీ నాయకుడు ఖాదర్‌బాషా మంగళవారం టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. అనంతరం ధనకొండ గంగమ్మ ఆలయంవద్ద 1116 కొబ్బరి కాయలు కొట్టారు. టీడీపీలో చేరిన ఖాదర్‌బాషాను టీడీపీ మండలాధ్యక్షుడు కిశోర్‌గౌడు, ప్రధానకార్యదర్శి సుబ్రమణ్యంశెట్టి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించి సత్కరించారు.

చినుకుపడితే శాంతిపురం చిత్తడే..!



శాంతిపురం, జూన్ 18 : చినుకుపడితే శాంతిపురం రోడ్లు చిత్తడవుతున్నాయి. మంగళవారం కురిసి కొద్దిపాటి వర్షానికి రోడ్లపై వర్షపు నీరు చేరి కుంటలను తలపిస్తున్నాయి. కేజీఎఫ్ రోడ్డులో కాలువలు ఆక్రమణకు గురికావడంతో కాలువలో ప్రవహించాల్సిన వర్షపు నీరు రోడ్లపైకి రావడంతో వాహన చోదకులు అవస్థలు పడ్డారు. వాహనాలు గుంతల్లో దిగి ఇబ్బంది పడ్డారు. అధికారులు స్పందించి రోడ్డుపైన నిల్వ ఉన్న వర్షపు నీటిని తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

పారిశుధ్యంపై ప్రత్యేకశ్రద్ధ వహించాలి

బైరెడ్డిపల్లె, జూన్ 18 : గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుపరచడానికి గ్రామ కార్యదర్శులు ప్రత్యేకశ్రద్ధ వహించాలని బైరెడ్డిపల్లె ఎంపీడీవో రాజేష్ పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం గ్రామకార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాలు కురుస్తున్నందున తాగునీటి పైపులైన్ల లీకేజీలు గుర్తించి ఎప్పటికప్పుడు సరిచేయాలన్నారు. తాగునీటి శ్యాంపిల్స్ పరీక్షించే కిట్లను కార్యదర్శులకు పంపిణీచేశారు. ఈ సమావేశంలో ఈవోఆర్డీ రాజేంద్రబాలాజీ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ లోకనాథం, ఎస్‌బీఎం కో-ఆర్డినేటర్ సురేష్‌బాబు పాల్గొన్నారు.

పలమనేరు
కుప్పం/పుంగనూరు

ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దుపై న్యాయవాదుల హర్షం



కుప్పం, జూన్ 18: ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను ప్రభుత్వం రద్దు చేయడంపై న్యాయవాదులు హర్షం వ్యక్తం చేశారు. ఆర్టీసీ బస్టాండ్ కూడలిలోని ఎన్టీఆర్ విగ్రహానికి పుష్పాంజలి ఘటించారు. చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు.

కార్యకర్తల సహకారంతోనే కూటమి విజయం



విశ్వనాథనాయుడును సన్మానిస్తున్న కార్యకర్తలు, నేతలు

శాంతిపురం, జూన్ 18 : కార్యకర్తల, నేతలు, ఉద్యోగస్తుల, ప్రజల సహకారంతోనే కూటమి విజయం సాధించిందని టీడీపీ మండల అధ్యక్షుడు భాష్యం విశ్వనాథ నాయుడు అన్నారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో విజయోత్సవ సంబరాలు చేపట్టారు. సొన్నేగానిపల్లె పంచాయతీ గుండిశెట్టిపల్లె గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్తలు, నాయకులు భాష్యం విశ్వనాథ నాయుడును, ఇతర నాయకులను ఘనంగా సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఐదేళ్ల వైసీపీ పాలనలో విసిగిపోయిన ప్రతి ఒక్కరూ కసిగా ఓట్లు వేయడంతోనే రాష్ట్రంలో కూటమికి 164 సీట్లు వచ్చాయన్నారు. ఇంతటి ఘనవిజయం తెచ్చిపెట్టిన ప్రతి ఒక్కరికీ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనిట్ ఇన్‌చార్జి బాలు, రమేష్, నారాయణప్ప, శివ, సరిత, వేద పాల్గొన్నారు.

తెలుగు భాష పరిరక్షణకు వినతి



ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్‌కు వినతి పత్రం అందిస్తున్న తులసీనాథంనాయుడు, ఇతర ఉపాధ్యాయులు

శాంతిపుర, జూన్ 18 : తెలుగు భాషను పరిరక్షణకు కృషి చేయాలని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్‌కు తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి అధ్యక్షుడు పి.తులసినాథం నాయుడు ఇతర ఉపాధ్యాయులతో కలిసి వినతి పత్రం అందించారు. మంగళవారం కుప్పంలో ఎమ్మెల్సీని కలిసి మాట్లాడారు. విద్యాహక్కు చట్టం, నూతన జాతీయ విద్యా విధానం 2020 ప్రకారం పాఠశాల విద్యను మాతృభాషలో కొనసాగేలా కృషి చేయాలని కోరారు. ప్రభుత్వ ప్రత్యుత్తరాలు తెలుగులో ఉండేలా కృషిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాసులురెడ్డి, యురళి, వినోద్, పరంధామనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ ఫలితాల్లో శాంతిపురం విద్యార్థుల ప్రతిభ

శాంతిపురం, జూన్ 18 : ఇంటర్ ఫలితాల్లో శాంతిపురం ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారని ప్రిన్సిపాల్ విజయకుమార్ తెలిపారు. మంగళవారం ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్ష ఫలితాలను ప్రభుత్వం విడదల చేసింది. ఈ ఫలితాల్లో శాంతిపురం జూనియర్ కళాశాలలో జనరల్ విభాగంలో 53 మందికి 50 మంది ఉత్తీర్ణత సాధించారన్నారు. 94.34 శాతం ఫలితాలు సాధించిన కళాశాల జిల్లాలో నాలగవ స్థానంలో నిలిచిందన్నారు. ఒకేషనల్ విభాగంలో 26 మందికి 25 మంది ఉత్తీర్ణత సాధించారని వివరించారు. మంచి ఫలితాలు సాధించేందుకు కృషిచేసిన అధ్యాపకులకు ప్రిన్సిపాల్ ప్రత్యేక అభినందనలు తెలిపారు.

గంగమాంబ సేవలో టీడీపీ నాయకులు

బైరెడ్డిపల్లె, జూన్ 18 : మండలంలోని తూర్పగడ్డ గ్రామంలో మంగళవారం జరిగిన గంగజాతరలో టీడీపీ మండలాధ్యక్షుడు కిశోర్‌గౌడు, ప్రధానకార్యదర్శి సుబ్రమణ్యంశెట్టి, తెలుగుయవత అధ్యక్షుడు భువనచంద్రగౌడు, రాజేష్ తదితరులు పాల్గొన్నారు. గంగమ్మను దర్శించుకుని ప్రత్యేకపూజలు నిర్వహించారు.

ఫిజిక్స్ టీచర్ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

బైరెడ్డిపల్లె, జూన్ 18 : మండలంలోని కమ్మనపల్లె గురుకుల పాఠశాలలో ఖాళీగా ఉన్న ఫిజిక్స్ టీచర్ పోస్టుకు ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఈ నెల 21వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని పాఠశాల ప్రిన్సిపాల్ శోభ ఒక ప్రకటనలో తెలిపారు. దీనికి సంబంధించి మరిన్ని వివరాలకు పాఠశాలలో సంప్రదించాలని తెలిపారు.

పుష్పపల్లకిపై వేణుగోపాలుడి విహారం

గుడుపల్లె, జూన్ 18: పుష్ప పల్లకిపై వేణుగోపాలుడు మంగళవారం విహరించి భక్తులను అనుగ్రహించారు. శెట్టిపల్లె గ్రామంలో కొలువైన వేణుగోపాల స్వామి ఆలయ వార్షిక ఉత్సవాల్లో భాగంగా ఉదయం స్వామి వారిని అర్చకులు ప్రత్యేక అభిషేకాలు, విశేషంగా పూజలు చేసి, భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. రాత్రి శ్రీదేవి, భూదేవి సమేత వేణుగోపాలుడి ఉత్సవర్లను పుష్ప పల్లకిపై అధిష్టింపజేసి పురవీధుల్లో ఊరేగించారు.

ఇదే సమన్వయం కొనసాగాలి: కంచర్ల



చిన్నారిదొడ్డి గ్రామంలో ర్యాలీ నిర్వహిస్తున్న ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, నాయకులు కార్యకర్తలు

శాంతిపురం, జూన్ 18 : వచ్చే 2029 ఎన్నికల్లోనూ ఇదే సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ కోరారు. మండల పరిధిలోని చిన్నారిదొడ్డి గ్రామంలో టీడీపీ నేతలు, గ్రామస్తులు టీడీపీ విజయోత్సవాలు ఘనంగా నిర్వహించారు. సార్వత్రిక ఎన్నికల్లో కూటమి విజయం సాధించడంతో మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి నాగరాజు, టీడీపీ మండల బీసీ సెల్ అధ్యక్షుడు చలపతి, బూత్ కన్వీనర్ శ్రీనివాసులురెడ్డి, టీడీపీ నేత నాగిరెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం సంబరాలు చేశారు. ఉదయం గ్రామ దేవత గంగమ్మకు ప్రత్యేక అభిషేక పూజలు నిర్వహించారు. పొంగళ్లు పెట్టారు. గ్రామంలో ర్యాలీలు చేపట్టారు. ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. అనంతరం ఎమ్మెల్సీ మాట్లాడుతూ ఇది ప్రజా విజయమన్నారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో ఇబ్బందులు ఎదుర్కొని కూటమి విజయానికి కృషి చేసిన ప్రతి కార్యకర్తకు న్యాయం జరుగుతుందన్నారు. 2029లో కూడా ఇలానే ఉండాలన్నారు. అందుకోసం ప్రతి కార్యకర్త ఇప్పటి నుంచే గ్రామ స్థాయిలో ప్రణాళికలు రూపొందించాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు, మండల పార్టీ అధ్యక్షుడు విశ్వనాథనాయుడు, రాష్ట్ర టీడీపీ కార్య నిర్వాహక కార్యదర్శి డాక్టర్ సురేష్‌బాబు మండల టీడీపీ నేతలు ఉదయకుమార్ విజయరామిరెడ్డి, మణి, బసవరాజు, రఘుపతి, మహిళ నేతలు తదితరులు పాల్గొన్నారు.

రెస్కో మాజీ ఛైర్మన్ సెంథిల్ ఇంటికి నోటీసులు





సెంథిల్ ఇంటి డోర్‌కు నోటీసు అంటించిన దృశ్యం, నిర్మాణంలో ఉన్న భవనం

కుప్పం, జూన్ 18: కుప్పంలో అధికారులు తమ అధికారాలకు పదును పెడుతున్నారు. వైసీపీ నాయకుల అక్రమాలపట్ల ఇన్నాళ్లూ మౌనంగా ఉన్నవారు, టీడీపీ అధికారం లోకి రావడంతో నిబంధనలకు ఊపిరి పోస్తున్నారు. ఆమేరకు చర్యలు తీసుకోవడానికి సిద్ధమవుతున్నారు. ఈ క్రమంలో నిర్మాణంలో ఉన్న రెస్కో మాజీ ఛైర్మన్, వైసీపీ నాయకుడు సెంథిల్ కుమార్‌కు చెందిన భవనానికి అనుమతులు లేవంటూ మంగళవారం మున్సిపల్ అధికారులు నోటీసులు పంపారు. కుప్పం పురపాలక సంఘం పరిధిలోని కుప్పం -కృష్ణగిరి జాతీయ రహదారిని ఆనుకుని తంబిగానిపల్లె చెక్ పోస్టు సమీపంలో ఉన్న భవన నిర్మాణానికి మున్సిపాలిటీ నుంచి అనుమతులు తీసుకోలేదని ఇందులో పేర్కొన్నారు. అనుమతులు లేని నిర్మాణాన్ని వెంటనే ఆపేయాలని ఆదేశించారు. లేనిపక్షంలో చర్యలు తప్పవని హెచ్చరించారు. వెంటనే మున్సిపాలిటీకి వచ్చి అనుమతుల కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. సెంథిల్ ఇంటికి తాళం వేసి ఉండడంతో డోర్‌కు మున్సిపల్ సిబ్బంది నోటీసు అంటించి వెళ్లారు.

సచివాలయ మరుగుదొడ్లకు తాళం వేసిన సర్పంచ్ భర్త



ఇబ్బంది పడుతున్న సిబ్బంది, ప్రజలు

చౌడేపల్లె, జూన్18: కాటిపేరి సచివాలయం వద్ద ఉన్న మరుగుదొడ్లకు కాటిపేరి సర్పంచ్ సరిత భర్త వెంకటరెడ్డి తాళం వేశారు. దీంతో సచివాలయ సిబ్బంది, ప్రజలు ఇబ్బంది పడుతున్నారని టీడీపీ నాయకులు కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ సచివాలయంలో ఉన్న మరుగుదొడ్లు డోర్లు సక్రమంగా ఏర్పాటు చేయలేదన్నారు. అసం పూర్తిగా ఉన్నా కాంట్రాక్టర్ బిల్లులు చేసుకున్నారన్నారు. అలాగే సచివాలయం ముందు రూ.3.5లక్షలతో కమ్యూనిటీ మరుగుదొడ్లు నిర్మించారన్నారు. అయితే సర్పంచ్ సరిత భర్త వెంకటరెడ్డి తాళాలు వేసి వారు తప్ప ఎవరూ వినియోగించుకోకుండా సచివాలయ సిబ్బందిని, ప్రజలను ఇబ్బంది పెడుతున్నారన్నారు. ఉన్నతాధికారులు స్పందించి మరుగుదొడ్లకు తాళాలు తీయించి వినియోగంలోకి తీసుకురావాలని కోరారు. ఈవిషయంపై పంచాయతీ కార్యదర్శి జాకీర్‌ను వివరణ కోరగా తాళాలు తీయించే ఏర్పాటు చేస్తానని పేర్కొన్నారు.

యాజమాన్య పద్ధతులతో ఉద్యాన పంటల్లో అధిక దిగుబడి

● జిల్లా ఉద్యానాధికారి మధుసూదన్



కుప్పంలో ఆర్బీకే సిబ్బందికి శిక్షణ ఇస్తున్న అధికారులు

కుప్పం, జూన్ 18: యాజమాన్య పద్ధతులను క్రమం తప్పకుండా పాటిస్తే ఉద్యాన పంటల విషయంలో అధిక దిగుబడులు సాధించవచ్చని జిల్లా ఉద్యానాధికారి మధుసూదన్ అన్నారు. కుప్పంలోని సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ (హార్టికల్చర్ హబ్)లో మంగళవారం జిల్లా ఉద్యాన శాఖ, డిజిటల్ గ్రీన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని నాలుగు మండలాల రైతు భరోసా కేంద్రాల సిబ్బందికి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ శిక్షణలో ఉద్యాన పంటలలో టమోటా, మామిడి, కూరగాయల అధిక దిగబడుల కోసం మెళకువలు, సూచనలు చేశారు. భూసార పరీక్ష విధానం వల్ల కలిగే ఉపయోగాలు వివరించారు. కొబ్బరి తోటల తెగుళ్లను సకాలంలో నివారించేందుకు 10 మిల్లీ లీటర్ల మోనోక్రోటోపాస్‌ను, 10 మిల్లీలీటర్ల నీటితో కలిపి చెట్టు వేరుకు ద్రావణం కలిపి కట్టాలని చెప్పారు. మందు పెట్టిన 45 రోజుల వరకు కాయలు కోయరాదన్నారు. పురుగు సోకిన ఎండిన తోటలకు ఒక కిలో యూరియా, రెండు కిలోల సూపర్ ఫాస్పేట్, రెండున్నర కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్ కలిపిన నీరు పెడితే చెట్టు త్వరగా కోలుకుని కాపు కాస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఉద్యాన శాఖ ఏడీహెచ్ ధనుంజయ్, డిజిటల్ గ్రీన్ నిర్వాహకురాలు యశోద, కుప్పం ఉద్యానాధికారి డింపు ప్రియ, అనిత, కుప్పం, గుడుపల్లె, శాంతిపురం, రామకుప్పం మండలాల రైతు భరోసా కేంద్రాల సిబ్బంది పాల్గొన్నారు.

దేశ సౌభాగ్యం కోసం ప్రత్యేక ప్రార్థనలు



చర్చిలో ప్రార్థనలు నిర్వహిస్తున్న పాస్టర్లు

కల్లూరు, జూన్ 18: పులిచెర్ల మండలం కల్లూరు చర్చిలో మంగళవారం పాస్టర్ ధన్‌రాజ్ ఆధ్వర్యంలో దేశ సౌభాగ్యం కోసం ప్రార్థనలు నిర్వహించారు. చిత్తూరు, తిరుపతి, అన్నమయ్య జిల్లాలోని పలువురు చర్చి పాస్టర్లు కల్లూరు చర్చికి చేరుకొని ప్రార్థనలు చేశారు. ప్రధాని నరేంద్రమోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు సారథ్యంలో అభివృద్ధి, సంక్షేమం వేగవంతం కావాలని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో పాస్టర్లు శాంసన్, జార్జ్, జాన్సన్, తిమోతి, డేనియల్, ప్రతాప్, సంపత్, మహర్షిబాబు తదితరులు పాల్గొన్నారు.

బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు కృషి



బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

కల్లూరు, జూన్ 18: బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలని పీలేరు లేబర్ అధికారి ఆనంద బాబు, ఎం ఈఓలు సిద్ధ రామయ్య, పోకల తాతయ్య తెలిపారు. పులిచెర్ల మండలం కల్లూరులో మంగళవారం చైల్డ్ లేబర్ స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. బేకరీలు, స్కూటర్ మెకానిక్ షెడ్లు, వెల్డింగ్ వర్క్‌షాపులు తదితర దుకాణాలను తనిఖీచేశారు. అధికారులు మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లలను పనిలో పెట్టకుండా బడికి పంపాలని కోరారు. బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు స్వచ్ఛంద సేవా సంస్థలు, యువత ముందుకు రావాలని పిలుపునిచ్చారు.

అమ్మవారికి బోనాల సమర్పణ




సోమల, జూన్ 18: రాష్ట్రంలో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వం ఏర్పాటుతో మంగళవారం ఇరికిపెంట పంచాయతీలోని అమ్మవార్లకు బోనాల పండుగ ఘనంగా నిర్వహించారు. గ్రామస్తులు ఎర్రమిట్ట మారెమ్మ, బంగ్లా వద్ద కట్టమీద గంగమ్మ, ఇరికిపెంట అంకాలమ్మ ఆలయాలను పచ్చని తోరణాలు, విద్యుత్ అలంకరణలు చేశారు. మహిళలు ఆలయాల వద్ద పొంగళ్లు వండి అమ్మవార్లకు సమర్పించారు. జిల్లా సర్పంచుల సంఘం మాజీ కార్యదర్శి శ్రీనివాసులు నాయుడు ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో చంద్రశేఖర్ నాయుడు, కోటీశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సోమల గంగమ్మకు మరుపల్లెం పూజలు

సోమల, జూన్ 18: సోమల స్వయంభేశ్వరస్వామి ఆలయం వద్ద గంగమ్మకు మరుపల్లెం పూజలు శాస్త్రోక్తంగా జరిపారు. సోమల గంగజాతర నేపథ్యంలో గత మంగళవారం అమ్మవారిని ప్రతిష్టించి వేడుకలు నిర్వహించారు. ఈ క్రమంలో మరుపల్లెం పూజలు, ఆసాదివారు అమ్మవారిని కీర్తిస్తూ గేయాలు ఆలపించారు. అమ్మవారికి పొంగళ్ల నైవేద్యంగా సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో వీవీ.రమణ, చెన్నరాయప్ప, శెట్టివారి మోహన్, ఐలా సురేంద్ర, కృష్ణప్ప పాల్గొన్నారు.

పల్లకిలో ఊరేగుతున్న భీమేశ్వరస్వామి



భీమగానిపల్లెలో ఊరేగుతున్న భీమేశ్వరస్వామి

పుంగనూరు రూరల్, జూన్18: మండలంలోని భీమగానిపల్లె గ్రామంలో వెలసిన భీమేశ్వరస్వామిని మంగళవారం పుష్పపల్లకిలో ఊరేగించారు. ఉదయాన్నే స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించి పుష్పపల్లకితో ప్రతిష్ఠించి మంగళవాయిద్యాల మధ్య ఊరేగించారు. మహిళలు మంగళ హారతులు సమర్పించారు.

చదువుతోనే ఉన్నతస్థాయికి



రొంపిచెర్లలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థుల

రొంపిచెర్ల, జూన్ 18: చదువుతోనే ఉన్నతస్థాయికి చేరుకోవచ్చని ఎంఈవో శ్రీనివాసులు తెలియజేశారు. మండల కేంద్రంలోని పలు వీధుల్లో 'నేను బడికిపోతా' కార్యక్రమంపై మంగళవారం ప్రజలకు అవగాహన కల్పించారు. విద్యార్థులు ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ పిల్లలను తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరారు. ప్రైవేటు పాఠశాలలకన్నా నాణ్యమైన బోధన అందుతోందని వివరించారు. ఎంఆర్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

బడిఈడు పిల్లలను పనిలో పెట్టుకోవడం నేరం

రొంపిచెర్ల: బడిఈడు పిల్లలను పనిలో పెట్టుకోవడం నేరమని పోలీసులు, విద్యాధికారులు హెచ్చరించారు. మంగళవారం పట్టణంలోని ప్రొవిజనల్ షాపులను, మెకానిక్ షాపులను తనిఖీ చేశారు. ఎస్‌ఐ సుకుమార్, ఎంఈవో శ్రీనివాసులు మాట్లాడుతూ పిల్లల తల్లిదండ్రులు తమ పిల్లల భవిష్యత్తు కోసం బడికి పంపాలని సూచించారు.

చిత్తూరు
జీడీ నెల్లూరు/పూతలపట్టు/నగరి

నిర్ణీత సమయం లోపు ఫిర్యాదులకు పరిష్కారం


అర్జీలు స్వీకరిస్తున్న కమిషనర్ అరుణ

చిత్తూరు, జూన్ 18: ప్రతి సోమవారమూ ప్రజల నుంచి అందే వినతులకు నిర్ణీత సమయంలోగా పరిష్కారం చూపాలని కమిషనర్ అరుణ అధికారులను ఆదేశించారు. చిత్తూరు నగరపాలక సంస్థ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు ఆరు ఫిర్యాదులు వచ్చాయి. ఇందులో ఇంజనీరింగ్ విభాగానికి 4, ప్రధాన కార్యాలయానికి సంబంధించి రెండు అర్జీలు ఉన్నాయి. కమిషనర్ ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించి, సంబంధిత అధికారులకు అప్పగించారు. సహాయ కమిషనర్ రామకృష్ణుడు, ఎంహెచ్‌వో అనిల్‌కుమార్ నాయక్ పాల్గొన్నారు.

వరసిద్ధుడి సేవలో ఎన్‌సీఆర్టీ సీఈవో


తాడేపల్లెకు జ్ఞాపిక అందిస్తున్న ఏఈవో

ఐరాల(కాణిపాకం), జూన్ 18: ఎన్‌సీఆర్టీ సీఈవో అండ్ డైరెక్టర్ తాడేపల్లె మంగళవారం కాణిపాక వరసిద్ధుడిని దర్శించుకున్నారు. ఏఈవో విద్యాసాగర్‌రెడ్డి ఆయనకు స్వాగతం పలికి, స్వామి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం వేదాశీర్వాద మండపంలో ఆశీర్వదించి స్వామి శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలు, జ్ఞాపిక అందించారు. ఆలయ సూపరింటెండెంట్ కోదండపాణి, ఇన్‌స్పెక్టర్ విఘ్నేష్ పాల్గొన్నారు.

సమష్టి కృషి వల్లే విజయం


చంద్రప్రకాష్‌ను సన్మానిస్తున్న టీడీపీ నేతలు

చిత్తూరు రూరల్, జూన్ 18: నాయకులు, కార్యకర్తల సమష్టి కృషి వల్లే పార్టీ విజయం సాధించిందని టీడీపీ జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు చంద్రప్రకాష్ పేర్కొన్నారు. పార్టీ గెలుపునకు కష్టపడిన వారికి తగిన గుర్తింపు ఉంటుందని తెలిపారు. మండలంలోని బీఎన్ఆర్ పేట టీడీపీ నాయకులు మంగళవారం ఆయన్ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా కార్యదర్శి జయచంద్రనాయుడు, నాయకులు శశికర్‌బాబు, శీను, కిరణ్, అయ్యప్ప, శ్రీనివాసులు పాల్గొన్నారు.

క్యాన్సర్ కేర్‌పై రెండో విడత శిక్షణ


మాట్లాడుతున్న వెంకటప్రసాద్

చిత్తూరు రూరల్, జూన్ 18: ప్రభుత్వాస్పత్రుల్లో ఆగస్టు నుంచి నిర్వహించనున్న క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలపై వైద్యులు, వైద్య సిబ్బందికి రెండో దశ శిక్షణ కార్యక్రమాన్ని డీఎంహెచ్‌వో కార్యాలయంలో మంగళవారం అడిషనల్ డీఎంహెచ్‌వో వెంకటప్రసాద్ ప్రారంభించారు. జూలై 10వ తేదీ వరకు ఈ శిక్షణ ఉంటుందని, ఆ తర్వాత ఇంటింటి సర్వే నిర్వహించనున్నామని చెప్పారు. ఎన్‌సీడీ కోఆర్డినేటర్ శిరీష, ఎపిడమాలజిస్ట్ శ్రీవాణి పాల్గొన్నారు.

ఇంటర్‌కూ మధ్యాహ్న భోజనం అమలు చేయాలి

చిత్తూరు (సెంట్రల్), జూన్ 18: ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లోనూ మధ్యాహ్న భోజన పథకం అమలు చేయాలని తెలుగు నాడు ఇంటర్మీడియట్ విద్య ఉద్యోగుల సంఘం గౌరవాధ్యక్షుడు మల్లయ్యనాయుడు, కార్య నిర్వాహక అధ్యక్షుడు శరత్‌చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్, కార్యదర్శి రామాంజనేయులు మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో జూనియర్ కళాశాలల విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అమలు చేశారని, తిరిగి ప్రారంభించాలని కోరారు.

బంగారమ్మకు విశేష పూజలు



కార్వేటినగరం, జూన్ 18: కార్వేటినగరం గ్రామ దేవత బంగారమ్మ ఆలయంలో మంగళవారం విశేష పూజలు నిర్వహించారు. ఎక్కువ సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని, మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు ప్రసాద్ ఆధ్వర్యంలో తీర్థ ప్రసాదాలు అందజేశారు.

ట్యాంకు పరిసరాలను శుభ్రపరచండి



కార్వేటినగరం, జూన్ 18: ఆర్‌కేవీబీ పేట గ్రామ పంచాయతీ రాజులకండ్రిగ దళిత వాడలో తాగునీటి ట్యాంకు పరిసరాలు అపరిశుభ్రంగా ఉన్నాయి. ట్యాంకు చుట్టూ పిచ్చి మొక్కలు పెరిగిపోయాయి. సమీపం లోనే పేడ దిబ్బలు వేశారు. తద్వారా నీరు కలుషితమయ్యే ప్రమాదం కనిపిస్తోంది. గతంలోనూ నీరు కలుషితమై పలువురు అనా రోగ్యం బారినపడ్డారు. పంచాయతీ అధికారులు దీనిపై దృష్టి సారించాల్సి ఉంది.

'నేను బడికిపోతా' విజయవంతం చేయండి

నింద్ర, జూన్ 8: బడి బయట పిల్లలను పాఠశాలల్లో చేర్పించేందుకు ప్రారంభించిన 'నేను బడికిపోతా' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీవో భవాని కోరారు. మంగళవారం ఎంపీడీవో కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ జూలై 12వ తేదీ వరకు నేను బడికిపోతా కార్యక్రమం ద్వారా 6-14 సంవత్సరం లోపు పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలని కోరారు. ఎంఈవోలు వసుమతి దేవి, శ్రీధర్‌రాజు, డీటీ మాధవీలత, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ శ్యామలదేవి తదితరులు పాల్గొన్నారు.

బడిఈడు పిల్లలను బడిలో చేర్పిద్దాం

నగరి, జూన్ 18: నేను బడికిపోతా కార్యక్రమం ద్వారా 6 నుంచి 14ఏళ్ల లోపు పిల్లలను వంద శాతం పాఠశాలల్లో చేర్పించాలని ఎంఈవోలు శ్రీదేవి, నమఃశివాయం అన్నారు. మంగళవారం ఎంఈవో కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. బడికి పోకుండా నిలిచిపోయిన వారిని గుర్తించి, తిరిగి చేర్పించాలని సూచించారు.

తిరుమలకు పాదయాత్ర



పెనుమూరు, జూన్ 18 : చంద్రబాబు సీఎం కావడంతో మండలంలోని గొడుగుమానుపల్లి గ్రామానికి చెందిన 15 మంది టీడీపీ నాయకులు మంగళవారం తిరుమలకు కాలినడకన వెళ్లారు. జీడీనెల్లూరు ఎమ్మెల్యే థామస్ సోదరుడు నిధి, పార్టీ మండలాధ్యక్షుడు రుద్రయ్యనాయుడు, పార్లమెంటు నియోజకవర్గ కార్యదర్శి తలారిరెడ్డెప్ప, తెలుగు యువత అధ్యక్షుడు చిరంజీవిరెడ్డి జెండా ఊపి యాత్రను ప్రారంభించారు. మాజీ ఎంపీపీ షణ్ముగవర్మ, బాలాజి, కోదండన్, మురళీమోహన్, హరి, నరేంద్రబాబు, రవి పాల్గొన్నారు.

సహకార కేంద్ర బ్యాంకు డిప్యూటీ మేనేజర్‌కు సన్మానం



నగరి, జూన్ 18: పట్టణ పరిధిలోని జిల్లా సహకార కేంద్ర బ్యాంకు డిప్యూటీ మేనేజర్ కార్తీక్ పదోన్నతిపై మేనేజర్‌గా సత్యవేడు బ్రాంచ్‌కు బదిలీ అయ్యారు. ఈ మేరకు మంగళవారం ఆయన్ను బ్యాంకు సిబ్బంది ఘనంగా సన్మానించారు. నగరి రూరల్ బ్యాంకు సీఈవో తులసిపిళ్లై, నగరి డీసీసీబీ బ్యాంకు మేనేజర్ సందీప్, సూపర్‌వైజర్ ఆనంద్ పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్లేట్ల వితరణ



నగరి, జూన్ 18: మున్సిపాలిటీ పరిధిలోని ఏకాంబర కుప్పం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు రూ.20 వేలు విలువైన భోజనం ప్లేట్లను రజనీకాంత్ అనే దాత అందించారు. హెచ్‌ఎం వి.ఎస్.హరిదాస్ సమక్షంలో విద్యార్థులకు అందజేశారు. గ్రామస్తులు మోహన్, మురళి, శ్రీకాంత్, పొన్నప్పన్, షణ్ముగం, నాగేంద్రన్, రవి పాల్గొన్నారు.

బడిఈడు పిల్లలు బడిలోనే ఉండాలి



బంగారుపాళ్యం, జూన్ 18: మండలంలోని బడిఈడు పిల్లలందరూ బడిలో ఉండాలని ఎంఈవో నాగేశ్వరరావు అన్నారు. మంగళవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఆయన ఉపాధ్యాయులతో సమావేశమై బడికి పోదాం కార్యక్రమాన్ని ప్రారంభించారు. డ్రాపౌట్లను గుర్తించి, ప్రభుత్వ బడుల్లో చేర్పించాలని సూచించారు. ఎంపీడీవో శివశంకర్, తహసీల్దార్ సుభద్రమ్మ, ఉపాధ్యాయులు, సీఆర్పీలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

వైసీపీకి బుద్ధి చెప్పిన ప్రజలు : టీడీపీ

గంగాధరనెల్లూరు, జూన్ 18: ఐదేళ్ల అరాచక వైసీపీ ప్రభుత్వానికి ప్రజలు బాగా బుద్ధి చెప్పారని టీడీపీ నేతలు పేర్కొన్నారు. వైసీపీ విధ్వంసాల పాలన ముగిసిందని, ఇక నుంచి ప్రజలు మెచ్చే పాలన ఉంటుందని తెలిపారు. అన్న క్యాంటీన్ల ద్వారా పేదల ఆకలి తీర్చనున్నట్లు పేర్కొన్నారు. ఈ మేరకు శ్రీధర్‌యాదవ్, కామసాని కోదండరెడ్డి, నియాజ్‌అలీ, కామసాని విజయకుమార్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు.

హోంమంత్రిని కలసిన టీఎన్ఎస్ఎఫ్ నేత



చిత్తూరు సిటీ, జూన్18: టీఎన్ఎస్ఎఫ్ చిత్తూరు పార్లమెంటు అధ్యక్షుడు వి.త్యాగరాజన్ మంగళవారం అమరావతిలో హోంశాఖ మంత్రి వంగలపూడి అనితను మర్యాదపూర్వకంగా కలిశారు. వైసీపీ ప్రభుత్వంలో రాష్ట్రంలో గంజాయి, డ్రగ్స్ వల్ల చాలామంది విద్యార్థులు, యువకులు భవిష్యత్తును నాశనం చేసుకున్నారని తెలిపారు. వాటిని నియంత్రించాలని విన్నవించినట్లు తెలిపారు.

సచివాలయ ఉద్యోగులకు సీఎం, పీఎం చిత్రపటాలు



వెదురుకుప్పం, జూలై 18: మండలంలోని పాతగుంట గ్రామ సచివాలయ ఉద్యోగులకు సీఎం చంద్రబాబు, పీఎం మోదీ చిత్ర పటాలను మంగళవారం కూటమి నాయకులు అందజేశారు. వాటిని కార్యాలయంలో తగిలించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు జి.మునికృష్ణారెడ్డి, ఎం.షణ్ముగం రెడ్డి, చిట్టెమ్మ, జనసేన పార్టీ యతీశ్వర్‌రెడ్డి, జి.మునిరత్నం పాల్గొన్నారు.


విజయవాడలో డిప్యూటీ సీఎం పవన్‌ను కలిసిన గుడిపాల మండల నాయకుడు పవన్ కుమార్

వైభవంగా నడివీధి గంగమ్మ జాతర




జాతరను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ - చీలాపల్లిలో ప్రత్యేక అలంకరణలో గంగమ్మ - పేయనపల్లిలో అంబళ్ళు తీసుకెళ్తున్న మహిళలు

చిత్తూరు కల్చరల్, జూన్ 18: గిరింపేట న్యూప్రశాంత్ నగర్‌కాలనీలో మంగళవారం నడివీధి గంగమ్మ జాతర వైభవంగా నిర్వహించారు. ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ నాయుడు అమ్మవారికి తొలిపూజలు చేసి, జాతరను ప్రారంభించారు. స్థానికులతోపాటు గుడిపాల, చిత్తూరు రూరల్, యాదమరి మండలాలకు చెందిన భక్తులు అమ్మవారికి పొంగళ్లు పెట్టి, అంబలి సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. మేకలు, పొట్టేళ్లు, కోళ్లను బలిచ్చారు. బుధవారం అమ్మవారికి విశేష పూజలు చేసి, సాయంత్రం ఊరేగించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

గుడిపాల : మండలంలోని పలు గ్రామాల్లో గంగ జాతర ఘనంగా నిర్వహించారు. పేయనపల్లి, చీలాపల్లి గ్రామాల్లో ఉదయం అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు చేసి, పూజలు నిర్వహించారు. అంబళ్లు పోసి మొక్కులు తీర్చుకున్నారు. రాత్రి బాణసంచా పేలుళ్లు, మంగళ వాయిద్యాల నడుమ అమ్మవార్లను ఊరేగించారు.

కార్వేటినగరం : కార్వేటినగరం గ్రామ పంచాయతీ బీసీ కాలనీలో మంగళవారం కొల్లాపురమ్మ జాతర ఘనంగా నిర్వహించారు. ముందుగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అలంకరించి, భక్తులకు దర్శనం కల్పించారు. మహిళలు కర్పూర నీరజనాలు అర్పించారు. సుబ్రమణ్యం రాజు ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

పాలసముద్రం : పాలసముద్రంలో మంగళవారం గంగజాతర ఘనంగా నిర్వహించారు. ఉదయం అమ్మవారికి అంబళ్లు పోసి, పొంగళ్లు పెట్టారు. సాయంత్రం విగ్రహాన్ని ఊరేగించారు. రాత్రి వీధినాటకం ఏర్పాటు చేశారు. చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ పాల్గొన్నారు. పార్టీ చిత్తూరు పార్లమెంటు నియోజకవర్గ జిల్లా అధ్యక్షుడు సీఆర్ రాజన్ ఆయన వెంట ఉన్నారు.

బంగారుపాళ్యం : మండలంలోని పాలేరు దళితవాడలో మంగళవారం గంగమ్మ జాతరను వైభవంగా నిర్వహించారు. అమ్మవారికి అంబళ్లు పోసి, పొంగళ్లు పెట్టి మొక్కులు తీర్చుకున్నారు.



విశేష అలంకరణలో కొల్లాపురమ్మ - గంగమ్మ సేవలో పాలేరు దళితవాడ వాసులు

సబ్‌స్టేషన్లలో ఫిర్యాదులకు పుస్తకాలు

- నాణ్యమైన విద్యుత్ సరఫరాకు కృషి
- ట్రాన్స్‌కో ఇన్‌చార్జ్ ఎస్ఈ సురేంద్రనాయుడు


సమావేశంలో మాట్లాడుతున్న సురేంద్రనాయుడు

చిత్తూరు రూరల్, జూన్ 18: వినియోగదారుల సమస్యలు తెలుసుకునేందుకు జిల్లాలోని ప్రతి సబ్‌స్టేషన్‌లోనూ ఫిర్యాదుల పుస్తకాలు ఏర్పాటు చేయాలని ట్రాన్స్‌కో ఇన్‌చార్జ్ ఎస్ఈ సురేంద్రనాయుడు అధికారులను ఆదేశించారు. ఎస్ఈగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత మంగళవారం చిత్తూరులో విద్యుత్ శాఖ ఈఈలు, డీఈలతో ఆయన సమావేశమయ్యారు. వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ అందించేందుకు కృషి చేయాలన్నారు. పెండింగ్ బిల్లుల వసూలును వేగవంతం చేయాలన్నారు. అర్బన్ ఈఈ మునిచంద్ర, రూరల్ ఈఈ హరి, డీఈలు పద్మనాభపిళ్లై, శేషాద్రి, జ్ఞానేశ్వర్, జయప్రకాష్, ఆనంద్ పాల్గొన్నారు.

సింహ వాహనంపై కోదండరాముడు



తవణంపల్లె, జూన్ 18: మండలంలోని టి.పుత్తూరు కోదండ రామాలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం స్వామివారు సింహ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం అర్చకులు స్వామివారికి తిరుమంజనం, పాలాభిషేకంతోపాటు ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించి, ఊంజల్‌సేవ నిర్వహించారు. సింహ వాహనంపై మేళతాళాల నడుమ పురవీధుల్లో ఊరేగించారు. ఆలయ ధర్మకర్త సిద్ధేశ్వరరెడ్డి, కార్యనిర్వాహకులు, ఉభయదారులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈవో గణపతి

గుడిపాల, జూన్ 18: విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించి, వంద శాతం ఉత్తీర్ణత సాధించే విధంగా కృషి చేయాలని ఎంఈవోలు గణపతి, రామ్‌నాయక్ సూచించారు. మంగళ వారం వారు ఎంపీడీవో కార్యాలయంలో ప్రధానోపాధ్యాయులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. 6-14 ఏళ్లలోపు పిల్లలు బడిలో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. నాడు-నేడు పనులు, మధ్యాహ్న భోజన మెనూపై చర్చించారు. ఐసీడీఎస్ పీడీ షహనాజ్ బేగం, సూపరింటెండెంట్ ఉపేంద్ర పాల్గొన్నారు.

కారు - బైక్ ఢీ : యువకుడి మృతి


సీయోన్ (ఫైల్‌ఫోటో)

గంగాధరనెల్లూరు, జూన్ 18: మండలంలోని రామానాయుడుపల్లె బస్టాప్ వద్ద కారు - ద్విచక్ర వాహనం ఢీకొన్న ప్రమాదంలో యువకుడు మృతి చెందాడు. ఈ ఘటన సోమవారం అర్ధరాత్రి చిత్తూరు - పుత్తూరు ప్రధాన రహదారిలో చోటుచేసుకుంది. గంగాధరనెల్లూరు నుంచి పుత్తూరు వైపు వెళుతున్న కారు రామానాయుడుపల్లె బస్టాప్ వద్ద గంగాధరనెల్లూరు పంచాయతీ కట్టకిందపల్లె దళితవాడకు రాజేంద్రన్ కుమారుడు సీయోన్ (26) బైక్‌ను ఢీకొట్టింది. సీయోన్‌కు తీవ్రగాయాలు కావడంతో చిత్తూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతిచెందాడు. మంగళవారం పోస్టుమార్టం నిర్వహించి, మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ శంకర్ తెలిపారు.

సర్పంచులను విస్మరించడమే వైసీపీ ఓటమికి కారణం

పెరుమాళ్లపల్లె వైసీపీ సర్పంచ్ శశి ఆనందరెడ్డి



వెదురుకుప్పం, జూన్ 18: వైసీపీ ప్రభుత్వం సర్పంచులను విస్మరించడమే సార్వత్రిక ఎన్నికల్లో ఓటమి చెందడానికి కారణమైందని వెదురుకుప్పం మండలం పెరుమాళ్లపల్లె సర్పంచ్ (వైసీపీ) బండి శశి ఆనందరెడ్డి పేర్కొన్నారు. అధికారం చేజిక్కించు కున్నాక సర్పంచులను పట్టించుకోక పోవడం, ఆర్థికంగా బలహీన పరచడం, పంచాయతీలకు వచ్చిన నిధులను ఇతరత్ర పథకాలకు మళ్లించడం, దీనిపై ఆందోళనలు చేసిన వారిపై కేసులు పెట్టడం వంటివి బాగా దెబ్బతీశాయని చెప్పారు. ఎన్నికలకు ముందు కూడా సర్పంచులకు, పంచాయతీలకు న్యాయం చేస్తామని జగన్ హామీ ఇవ్వలేదని అన్నారు.

పాఠశాలల బస్సులకు ఎఫ్‌సీ తప్పనిసరి


స్కూల్ బస్సులను తనిఖీ చేస్తున్న రాజేశ్వరరావు

చిత్తూరు సిటీ, జూన్18: పాఠశాలలు, కళాశాలల బస్సులకు ఎఫ్‌సీ తప్పనిసరిగా ఉండాలని, లేకపోతే సీజ్ చేస్తామని డీటీసీ నిరంజన్ రెడ్డి హెచ్చరించారు. మంగళవారం జిల్లావ్యాప్తంగా పాఠశాలల బస్సులపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఉదయం 6 గంటల నుంచే తనిఖీలు ప్రారంభించారు. డీటీసీ మాట్లాడుతూ జిల్లాలో పాఠశాలలు, కళాశాలకు చెందిన 940 బస్సులున్నాయని, ఇందులో 870 ఎఫ్‌సీలు చేసుకున్నాయని తెలిపారు. మిగిలిన వాటికీ చేయించుకోవాలని సూచించారు. స్పెషల్ డ్రైవ్‌లో ఎఫ్‌సీ, డ్రైవింగ్ లైసెన్స్, ఇన్సూరెన్స్ లేని 8 బస్సులపై కేసులు నమోదు చేశామని, నాలుగు సీజ్ చేశామని పేర్కొన్నారు. ఈ కార్య క్రమంలో ఆర్టీవో సునీల్ కుమార్, ఎంవీఐలు రాజేశ్వరరావు, వాసుదేవరెడ్డి, మురళి, దీపిక, ఏఎంవీఐలు ప్రసాదవర్మ, భాగ్యశ్రీ పాల్గొన్నారు.

అమ్మవారికి బోనాల సమర్పణ



సోమల, జూన్ 18: రాష్ట్రంలో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వం ఏర్పాటుతో మంగళవారం ఇరికిపెంట పంచాయతీలోని అమ్మవార్లకు బోనాల పండుగ ఘనంగా నిర్వహించారు. గ్రామస్తులు ఎర్రమిట్ట మారెమ్మ, బంగ్లా వద్ద కట్టమీద గంగమ్మ, ఇరికిపెంట అంకాలమ్మ ఆలయాలను పచ్చని తోరణాలు, విద్యుత్ అలంకరణలు చేశారు. మహిళలు ఆలయాల వద్ద పొంగళ్లు వండి అమ్మవార్లకు సమర్పించారు. జిల్లా సర్పంచుల సంఘం మాజీ కార్యదర్శి శ్రీనివాసులు నాయుడు ఆధ్వర్యంలో భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో చంద్రశేఖర్ నాయుడు, కోటీశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సోమల గంగమ్మకు మరుపల్లెం పూజలు

సోమల, జూన్ 18: సోమల స్వయంభేశ్వరస్వామి ఆలయం వద్ద గంగమ్మకు మరుపల్లెం పూజలు శాస్త్రోక్తంగా జరిపారు. సోమల గంగజాతర నేపథ్యంలో గత మంగళవారం అమ్మవారిని ప్రతిష్ఠించి వేడుకలు నిర్వహించారు. ఈ క్రమంలో మరుపల్లెం పూజలు, ఆసాదివారు అమ్మవారిని కీర్తిస్తూ గేయాలు ఆలపించారు. అమ్మవారికి పొంగళ్లు నైవేద్యంగా సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో వీవీ.రమణ, చెన్నరాయప్ప, శెట్టివారి మోహన్, ఐలా సురేంద్ర, కృష్ణప్ప పాల్గొన్నారు.

పల్లకిలో ఊరేగిన భీమేశ్వరస్వామి



పుంగనూరు రూరల్, జూన్18: మండలంలోని భీమగానిపల్లె గ్రామంలో వెలసిన భీమేశ్వరస్వామిని మంగళవారం పుష్పపల్లకిలో ఊరేగించారు. ఉదయాన్నే స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి పుష్పపల్లకితో ప్రతిష్ఠించి మంగళవాయిద్యాల మధ్య ఊరేగించారు. మహిళలు మంగళ హారతులు సమర్పించారు.

టీచర్ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

బైరెడ్డిపల్లె, జూన్ 18 : మండలంలోని కమ్మనపల్లె గురుకుల పాఠశాలలో ఖాళీగా ఉన్న ఫిజిక్స్ టీచర్ పోస్టుకు ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఈ నెల 21వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని పాఠశాల ప్రిన్సిపాల్ శోభ ఒక ప్రకటనలో తెలిపారు. దీనికి సంబంధించి మరిన్ని వివరాలకు పాఠశాలలో సంప్రదించాలని తెలిపారు.

పుష్పపల్లకిపై వేణుగోపాలుడి విహారం

గుడుపల్లె, జూన్ 18: పుష్ప పల్లకిపై వేణుగోపాలుడు మంగళవారం విహరించి భక్తులను అనుగ్రహించారు. శెట్టిపల్లె గ్రామంలో కొలువైన వేణుగోపాల స్వామి ఆలయ వార్షిక ఉత్సవాల్లో భాగంగా ఉదయం ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేసి, భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. రాత్రి శ్రీదేవి, భూదేవి సమేత వేణుగోపాలుడి ఉత్సవర్లను పుష్ప పల్లకిపై అధిష్ఠింపజేసి పురవీధుల్లో ఊరేగించారు.

రెస్కో మాజీ చైర్మన్ సెంథిల్ ఇంటికి నోటీసులు



సెంథిల్ ఇంటి డోర్‌కు నోటీసు అంటించిన దృశ్యం, నిర్మాణంలో ఉన్న భవనం

కుప్పం, జూన్ 18: కుప్పంలో అధికారులు తమ అధికారాలకు పదును పెడుతున్నారు. వైసీపీ నాయకుల అక్రమాలపట్ల ఇన్నాళ్లూ మౌనంగా ఉన్న వారు, టీడీపీ అధికారం లోకి రావ డంతో నిబంధ నలకు ఊపిరి పోస్తు న్నారు. ఆమేరకు చర్యలు తీసుకోవడానికి సిద్ధమవు తున్నారు. ఈ క్రమంలో నిర్మాణంలో ఉన్న రెస్కో మాజీ ఛైర్మన్, వైసీపీ నాయకుడు సెంథిల్ కుమార్‌కు చెందిన భవనానికి అనుమతులు లేవంటూ మంగళవారం మున్సిపల్ అధికారులు నోటీసులు పంపారు. కుప్పం పురపాలక సంఘం పరిధిలోని కుప్పం -కృష్ణగిరి జాతీయ రహదారిని ఆనుకుని తంబిగానిపల్లె చెక్ పోస్టు సమీపంలో ఉన్న భవన నిర్మాణానికి మున్సిపాలిటీ నుంచి అనుమతులు తీసుకోలేదని ఇందులో పేర్కొన్నారు. అను మతులు లేని నిర్మాణాన్ని వెంటనే ఆపేయాలని ఆదేశించారు. లేనిపక్షంలో చర్యలు తప్పవని హెచ్చరించారు. వెంటనే మున్సిపాలిటీకి వచ్చి అనుమతుల కోసం దర ఖాస్తు చేసుకోవాలని సూచించారు. మంగళవారం సెంథిల్ ఇంటికి తాళం వేసి ఉండడంతో డోర్‌కు మున్సిపల్ సిబ్బంది నోటీసు అంటించి వెళ్లారు.